Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్య సేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool




| బుధవారం WEDNESDAY | 21.05.2025 | నల్గొండ NALGONDA | సంపుటి (Volume): 2 సంచిక (Issue) : 272 | పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- | ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah |
|---|---|---|---|---|---|

### స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను...

# దోచుకుంటున్న రోహింగ్యాలు



**అమరావతి మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** రోహింగ్యా శరణార్థుల వలస స్థానిక యువతకు నిరుద్యోగానికి దారితీస్తోందని మరియు అంతర్గత భద్రతా సవాలును సృష్టిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. వ్యవస్థలోని కొంతమంది వలసదారులకు శాశ్వత పరిష్కారాన్ని కల్పిస్తున్నారని, సరిహద్దు భద్రతా దళాల కంటే పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ నాయకుడు అన్నారు. విజయవాడలోని గన్నవరం విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, శ్రీ కళ్యాణ్ దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదులకు "సాఫ్ట్ టార్గెట్స్" అని మరియు తీరప్రాంతంలో నిఘా పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రాష్ట్ర పోలీసులకు మరియు పరిపాలనా సిబ్బందికి లేఖ రాశానని, అప్రమత్తంగా ఉండాలని కోరానని చెప్పారు. "రాష్ట్రంలో ఉగ్రవాద కార్యకలాపాల జాడలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉండేలా చూడాలని నేను ఒక లేఖ ద్వారా డిజిపిని అభ్యర్థించాను.

2వ పేజీ లో...

# రాష్ట్రంలో త్వరలో స్కిల్ సర్వే



**రామగిరి మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖమాత్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.

2వ పేజీ లో...

### జనంలో పలుచనవుతాం...

# జాగ్రత్త



2వ పేజీ లో...

## పనితీరు మెరుగుపడాలి

**హైదరాబాద్, మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** శాసనసభ్యులు తమ పని తీరును మెరుగుపరుచుకోవాలని ఒకరిద్దరు ఎంఎల్‌ఎలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ముగ్గురు ఎంఎల్‌ఎలతో మంగళవారం సిఎం సమావేశమయ్యారు. కంటోన్మెంట్, మెదక్ ఎంఎల్‌ఎలను కూడా సమావేశానికి పిలిచి వారి పనితీరుపై ఇంటలిజెన్స్ నివేదికలను ఎంఎల్‌ఎల ముందు ఉంచారు. పాలమూ రు జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో అంతర్గత పంచాయితీలను సెటిల్ చేసుకోవాలని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ఎంఎల్‌ఎలకు సూచించారు.

### జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా

# భూసర్వే



**కరీంనగర్ మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** వచ్చే నెల 2 నుండి రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పకడ్బందీగా నిర్వహిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

2వ పేజీ లో...

### కెసిఆర్, హరీశ్, ఈటలకు...

# ఘోష్ పిలుపు

**హైదరాబాద్, మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరింది. ఈ నేపథ్యంలోనే మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. వారు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. జూన్ 5వ తేదీన కెసిఆర్, 6వ తేదీన హరీశ్‌రావు, 9వ తేదీన ఈటల రావాలని కమిషన్ ఈ నోటీసుల్లో పేర్కొంది. కాళేశ్వరం నిర్మాణం వ్యవహారంలో ని జాన్ని నిగ్గు తేల్చాల్సిందిగా 2024, మార్చిలో జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో ఈ కమిషన్ ఏర్పాటు అయ్యింది. దాదాపు పద్నాలుగు నెలలుగా ఈ కమిషన్ విచారణ జరుపుతోంది. కమిషన్ విచారణ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా, కమిషన్ గడువును ప్రభుత్వం మరో రెండునెలల (జూలై 31) వరకు పొడిగించింది.

2వ పేజీ లో...



# రన్యారావుకు బెయిల్

**బెంగళూరు మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావుతో పాటు తరుణ్ రాజ్ కొండూరుకు బెంగళూరు కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు ఇద్దరికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ. 2లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తుతో బెయిల్‌ని ఇచ్చింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించొద్దని.. దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని.. భవిష్యత్‌లో ఇదే తరహాలో నేరాల్లో పాల్గొనొద్దని ఆదేశించింది. ఆదేశాలను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని హెచ్చరించింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ 60రోజుల్లోగా చార్జిషీట్‌ని దాఖలు చేయలేకపోయారు. ఈ క్రమంలో రన్యారావు, తరుణ్ రాజ్ ఇద్దరు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు.. షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. కన్నడ నటి అయిన రన్యారావును మార్చి 3న బంగారం స్మగ్లింగ్ కేసులో డీఆర్‌ఐ అధికారులు అరెస్టు చేశారు. విమానాశ్రయంలో ఆమెను అదుపులోకి తీసుకొని.. రూ. 12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. 14.2 కిలోల విదేశీ బంగారు కడ్డీలను తీసుకెళ్తున్నట్లు ఆమె గుర్తించింది. ఇదే కేసులో తరుణ్ రాజ్, సాహిల్ సకారియా జైన్‌లను అరెస్టు చేశారు. ప్రస్తుతం ముగ్గురు బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర జైలులో ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 22న కేంద్రం ముగ్గురిపై కొఫిపోసా చట్టాన్ని ప్రయోగించింది.



### పాక్ ఏజెంట్‌తో చాట్ డిలిట్...

# ఫోరెన్సిక్ కు జ్యోతి ఫోన్‌లు, ల్యాప్‌టాప్

**న్యూఢిల్లీ, మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లకు కీలక సమాచారాన్ని చేరవేసిన ఆరోపణల నేపథ్యంలో గూఢచర్యం కేసు కింద అరెస్టైన హర్యానాకు చెందిన యూట్యూబర్, ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రాపై అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో గూఢచర్య కేసు దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పాకిస్తాన్ హైకమిషన్ మాజీ అధికారి డానిష్‌తో ఆపరేషన్ సిందూర్ గురించి మల్హోత్రా కీలక విషయాలు పంచుకుంది. అనంతరం తన చాట్ ను డిలిట్ చేసింది. ఎలాంటి డిజిటల్ ఆధారాలు లేకుండా చేసే ప్రయత్నం చేసింది. న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో సిబ్బందిగా ఉన్న సమయంలో మల్హోత్రాతో డానిష్ సన్నిహిత సంబంధం పెట్టుకుని కీలక సమాచారాన్ని సేకరించాడు. పాకిస్తాన్ హైకమిషన్‌లో జరిగిన సమావేశంలో డానిష్ మల్హోత్రాను పలువురు పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటర్లకు పరిచయం చేశాడు. ఆ తర్వాత మే 13న గూఢచర్యం ఆరోపణలపై పర్సనా నాన్ గ్రాటాగా ప్రకటించి భారత్ నుండి డానిష్ ను బహిష్కరించారు. వర్గాల సమాచారం ప్రకారం, ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన చాట్ లాగ్‌లతోపాటు మొబైల్ లో ఉన్న ఇతర కీలకమైన ఆధారాలను జ్యోతి మల్హోత్రా తొలగించింది. ఆపరేషన్ సిందూర్, హిసార్‌లోని తన స్వస్థలంలో జరిగిన బ్లాక్‌అవుట్ గురించి, ఆ సమయంలో పరిపాలనా కార్యకలాపాల గురించి, అధికారుల నుండి సైరన్‌లు, అధికారిక సందేశాల గురించి జ్యోతి డానిష్‌కు తెలియజేసింది. తర్వాత డానిష్‌తో చేసిన చాట్‌లను తొలగించిందని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో తొలగించబడిన డేటాను తిరిగి పొందడానికి మల్హోత్రా రెండు మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌ను ఫోరెన్సిక్ కు పంపారు.



# రాష్ట్రంలో త్వరలో స్కిల్ సర్వే

1వ పేజీ తరువాయి

మంగళవారం రామగుండం3 అడ్రియాల ప్రా జెక్టు ఏరియాలోని ఎంవిటిసిలో సింగరేణి సంస్థ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌సెంటర్(నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేం ద్రం)ను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అ తిథిగా హాజరై ప్రారంభించారు. విశిష్ట అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్రసుధాకర్‌రావు అధ్యక్షత వహించి సింగరేణి సంస్థ ద్వారా పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో ఉచితంగా ఇస్తున్న శిక్షణ గురించి తెలియజేశారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సింగరేణి సంస్థ నిరుద్యోగ యువతీయువకుల్లో వృత్తి నైపుణ్యత పెంచి, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వివిధ ఏరియాల్లో ఇలాంటి శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తుందన్నారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా సుమారు 38 కోర్సులలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వబడుతుందని, అలాంటి శిక్షణ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందే అభ్యర్థులు సర్టిఫికెట్ కోసమే కాకుండా పూర్తిస్థాయిలో శిక్షణ పొంది నిజమైన నైపుణ్యాన్ని సాధించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందని, త్వరలో రాష్ట్రంలో స్కిల్ సర్వే నిర్వహించి నిరుద్యోగులకు వివిధ విభాగాల్లో ఉన్నటువంటి నైపుణ్యత ఆధారంగా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఒక కళాశాలగా అభివృద్ధి చేసి ఇక్కడి నుండే నియామకాలు చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ జె.అరుణశ్రీ, హెచ్ఆర్‌డి విభాగం జనరల్ మేనేజర్ గుంజపడుగు రఘుపతి, రామగుండం1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌ఉమార్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం నాయకులు కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.నరసింహులు, ఆర్‌డిఓ సురేష్, ఎస్ఓటు జీఎం బివి సత్యనారాయణ, వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ పనుల పూర్తి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ, మే 20 (సూర్య సేన) :** రానున్నమూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేసిన జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం, జి .ఎడవెల్లి గ్రామ చెరువు కు సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రైతాంగం ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు, రిజర్వాయర్లను పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా జి .యడవల్లి చెరువు తూము ,ఇతర పనుల మరమ్మతుకు గాను కోటి రూపాయలను డి ఎం ఎఫ్ టి ద్వారా మంజూరు చేయడమే కాకుండా, బుధవారం నుండి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నాలుగువేల కోట్ల రూపాయల వ్యయంతో ఎస్ఎల్ బీసీ సొరంగం పనులు చేపట్టడం జరిగిందని , అయితే అటువైపునుండి సొరంగం కూలిపోవడం వల్ల పనులు ఆగిపోయినప్పటికీ తిరిగి పనులను ప్రారంభించి మూడు ఏళ్లలో ఎస్ఎల్బీసీని పూర్తి చేస్తామని చెప్పారు.



**ఎడ్లవల్లిలో 80 మందికి ఇందిరమ్మ ఇళ్లు** ఎడవల్లి గ్రామంలో 4 కోట్ల రూపాయల వ్యయంతో 80 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. దీనితొపాటు, 5 కోట్ల రూపాయలతో బీటి రోడ్లు, 30 లక్షల తో డ్రైనేజీ మంజూరు చేశామని తెలిపారు. ఎడవల్లి చెరువు మరమ్మతు పనులను నాణ్యతగా చేపట్టాలని, నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కనగల్ ఆస్పత్రిలో గ్లాకోమా కంటి పరీక్షలకు అధునాతన యంత్రం ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా ఆస్పత్రి మాదిరిగా కనగల్ ఆసుపత్రిని తీర్చిదిద్దడం జరిగిందని వెల్లడించారు. కనగల్ మండల మహిళా సమాఖ్య సభ్యులకు అయిటి పాములలో లాగే సోలార్ విద్యుత్ యూనిట్ ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు . ఏవైనా సమస్యలు ఉంటే మండల ప్రజలు తన దృష్టికి తీసుకు రావాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఒక్కరిలోనూ సృజనాత్మకత ఉంటుంది: మంత్రి శ్రీధర్ బాబు

**రామగిరి, మే 20 (సూర్య సేన) :** ప్రతి ఒక్కరిలోనూ సృజనాత్మకత దాగి ఉంటుందని.. దానిని వెలికితీయడం ద్వారా గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర ఐటి పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈసందర్భంగా సింగరేణి సంస్థ ఆర్జీ- 3 జీఎం నరేందర్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ%ొ% కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుండి ప్రస్తుతం ఇప్పటివరకు 57 వేల మందికి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, ఇంకా 20 నుంచి 25 వేల మంది నిరుద్యోగులు వ్నిగులున్నారన్నారు. అయితే అదే లక్ష్యంతో వారికి కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముందస్తుగా స్కిల్ డెవలప్మెంట్ చేసినప్పుడే ఉద్యోగ అవకాశం మెరుగవుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ %-% ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు-చేయడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, దానిని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎంతోమంది నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో-ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే యంగ్ ఇండియా ఆధ్వర్యంలో-ట్రైనింగ్ ఇప్పించి 600 మందికి ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ మంతిని ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను




ముందస్తుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలోని యువతను గుర్తించి వారిలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ మొదటి వారం నుండి గ్రామాల్లో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వారికి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కొయ్య శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, ఆర్జీ- 1 జీఎం లలిత్ కుమార్, ఏఎల్‌పీ జీఎం నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

# సిఎం స్థానంలో అక్రమాలను ప్రోత్సహించడం సమంజసమా?: జగన్

**అమరావతి, మే 20 (సూర్య సేన) :** టిడిపికి బలం లేకున్నా ఉప ఎన్నికల్లో గెలిచినట్టు ప్రకటించుకుంటున్నారని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. నరసరావుపేట, కారంపూడిలో గెలిచామని ప్రకటించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా జగన్ మీడియాతో మాట్లాడుతూ..కుప్పం మొదలు ఎక్కడ చూసినా ఇలాంటి పరిస్థితని, రామగిరి ఉప ఎన్నికలో అరాచకాలకు అంతులేదని మండిపడ్డారు. సిఎం స్థానంలో అక్రమాలను ప్రోత్సహించడం సమంజసమా?నని జగన్ ప్రశ్నించారు. పోలీసులను పెట్టి వైఎస్ఆర్ సిపి సభ్యులను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలిలో తమ పార్టీ గట్టిగా నిలబడి గెలిచామని చెప్పారు. ఏ ప్రభుత్వంపైనైనా వ్యతిరేకత రావాలంటే సమయం పడుతుందని, కూటమి ప్రభుత్వంపై నెలల్లోనే విపరీతమైన వ్యతిరేకత ఉందని తెలియజేశారు. తనకన్నా ఎక్కువ చేస్తానని చంద్రబాబు హామి ఇచ్చారని, జగన్ ఇచ్చేవన్నీ ఇస్తాను, అంతకంటే ఎక్కువ ఇస్తానన్నారని పేర్కొన్నారు. కానీ వాటన్నింటినీ తుంగలో తొక్కారని ఎద్దేవా చేశారు. "మన ప్రభుత్వంలో మేనిఫెస్టోతో గడప గడపకూ కార్యక్రమం కింద ప్రతి ఇంటికి వెళ్లాము. మనం చేసిన మంచి ఎక్కడికీ పోదు." అని అన్నారు. 10 శాతం ప్రజలు చంద్రబాబు ఏదో చేస్తారని నమ్మారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రభుత్వాన్ని ఫుట్బాల్ లా తంతారని ధ్వజమెత్తారు. హామీల అమలుపై గట్టిగా నిలదీస్తారనే భయం వారికి ఉందని, మాట ఇవ్వడమంటే వెన్ను పోటని బాబు నిరూపించారని విమర్శించారు. పేదవాడి వైద్యం గురించి ఆలోచించే పరిస్థితి లేదని, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని చెప్పారు. రూ.3600 కోట్లు పెండింగ్ లో పెట్టారని, ఆరోగ్య ఆసరాలను పూర్తిగా ఎత్తివేశారని అన్నారు. వైద్యం కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడిందని జగన్ స్పష్టం చేశారు.



# జనంలో పలుచనవుతాం... జాగ్రత్త

1వ పేజీ తరువాయి

**హైదరాబాద్, మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** ఇటీవల స మావేశాలు, సభల్లో చోటు చేసుకుంటున్న కొన్నిసంఘటనలు అవాంఛనీయమని ప్ర భుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అ భిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో తగ ని విధంగా ప్రవర్తించటం సరికాదని పేర్కొం టూ ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలి కాలంలో కొంతమం ది అఖిల భారత సర్వీసు అధికారులు సామూహిక సమావేశాలు, సభల్లో సర్వీసు హోదాకు తగనటువంటి చర్యలు, హావభావాలు ప్రదర్శిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వ చ్చిందని, ఇలాంటి ప్రవర్తన ప్రజల్లో ఆ సర్వీ సు అధికారుల మీద నమ్మకాన్ని కోల్పోయే లా చేస్తుందని సిఎస్ తెలిపారు. అఖిల భార త సేవల ప్రవర్తనా నియమావళి, 1968 లోని నిబంధన 3(1) ప్రకారం ప్రతీ సర్వీసు అధికారి ఆయన తెలిపారు. ప్రజలను కలిసినప్పుడు ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు హుందాతనం ప్రదర్శించాలని సిఎస్ సూచించారు. ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు విధి నిర్వహణలో నిబద్ధతతో, అంకితభావంతో, క్రమశిక్షణతో వ్యవహరించాలని సిఎస్ పేర్కొన్నారు.

**సచివాలయంలోని అన్ని విభాగాధిపతులు కూడా**

సచివాలయంలోని అన్ని విభాగాధిపతులు కూడా నిబంధనలను అతిక్రమించకుండా తమ కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులకు కూడా సూచనలు ఇవ్వాలని సిఎస్ సూచించారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని సిఎస్ హెచ్చరించారు. సోమవారం అచ్చంపేట్‌లో జరిగిన సభలో గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ సిఎం రేవంత్‌కు పాదాభివందనం చేయడానికి పయత్నించడంతో ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే సిఎస్ రామకృష్ణారావు ఆల్ఇండియా సర్వీసెస్ అధికారుల నియమావళిని మరోసారి గుర్తు చేస్తూ ఈ రెండు మెమోలను జారీ చేయడం విశేషం.

# స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను దోచుకుంటున్న రోహింగ్యాలు: పవన్ కళ్యాణ్

1వ పేజీ తరువాయి

పరిపాలనతో సమన్వయం చేసుకుని ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేను వారిని ఆదేశించాను. వలసదారులపై సరైన నిఘా ఉంచడం వల్ల సంభావ్య ప్రమాదాలను నివారించవచ్చు. తీరప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ మరియు నిఘా పెంచాల్సిన అవసరం కూడా ఉంది. గతంలో, కాకినాడలో పడవ ద్వారా బయటి వ్యక్తులు వస్తున్నట్లు నివేదికలు వచ్చాయి" అని ఆయన అన్నారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇటీవల నిర్వహించిన సంయుక్త ఆపరేషన్లలో ఉగ్రవాద కార్యకలాపాల జాడలు బయటపడ్డాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 2017-18లో బంగారు కార్మికులుగా పనిచేయడానికి పెద్ద సంఖ్యలో రోహింగ్యాలు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారని శ్రీ కళ్యాణ్ అన్నారు. "మయన్మార్ నుండి వచ్చిన రోహింగ్యాలు స్థానిక యువత నిరుద్యోగ సమస్యలను ఎదుర్కొన్నారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లలో ఒక ముఖ్యమైన డిమాండ్ స్థానికులకు ఉద్యోగాలకు ప్రాధాన్యత ఇవ్వడం, ఇది తెలంగాణ ఏర్పాటు సమయంలో ప్రధాన నినాదం." రోహింగ్యాలు సరిహద్దులు దాటి రేషన్ కార్డులు, ఆధార్ మరియు ఓటరు ఐడిలను పొందుతున్నారని ఆయన అన్నారు. "రోహింగ్యాలు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించడంలో వ్యవస్థ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వారు ఆధార్, ఓటరు మరియు రేషన్ కార్డులను ఎలా పొందుతున్నారు మరియు దీనికి ఎవరు దోహదపడుతున్నారు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వ్యవస్థలోని కొంతమంది వ్యక్తులు వారికి సహాయం చేస్తున్నారని స్పష్టంగా తెలుస్తుంది" అని ఆయన అన్నారు. రోహింగ్యాలు పౌరులుగా ఎలా మారుతున్నారు మరియు స్థానికులకు ఉద్దేశించిన అవకాశాలను ఎలా ఆక్రమించుకుంటున్నారనే దానిపై అవగాహన అవసరం అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. "బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీ నాయకుడిగా, రోహింగ్యాల స్థిరనివాసానికి వీలు కల్పించే వ్యవస్థను నిశితంగా పరిశీలించాలని మరియు అంతర్గత భద్రత కోసం మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరుతూ నేను ఒక లేఖ రాశాను" అని ఆయన అన్నారు.

# కెసిఆర్, హరీశ్, ఈటలకు... ఘోష్ పిలుపు

1వ పేజీ తరువాయి

ఎప్పటికప్పుడు అవసరానికి తగ్గట్టుగా ప్రభుత్వం 7 సార్లు ఈ కమిషన్ గడువును పొడిగిస్తూ వస్తున్న ది. కమిషన్ విచారణలో భాగంగా బ్యారేజీ నిర్మాణంలో పనిచేసిన ఏఈలు, డీఈలు, ఎస్ఈలతో పాటు రాష్ట్ర స్థాయి అధికారులను సైతం ఈ కమిషన్ విచారించింది. వారి నుంచి అఫిడవిట్ల రూపంలో వాంగ్మూలాన్ని స్వీకరించి వాటిని క్రాస్ ఎగ్జామిన్ చేయడంతో పాటు బహిరంగంగా వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ విచారణలో భాగంగా డిపిఆర్‌లు ఒకలా, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు మరోలా ఉన్నాయని కమిషన్ నిర్ధారించుకుంది. పనుల్లో నాణ్యత లోపాలు, అధికారుల నిర్లక్ష్యం ఉన్నాయని కూడా కమిషన్ ఓ నిర్ధారణకు వచ్చింది. ఎన్డీఎస్ఏ, కాగ్, విజిలెన్స్ రిపోర్టులను సైతం కాళేశ్వరం కమిషన్ పరిశీలించింది. ఈ నిర్మాణ పనులు జరిగేటప్పుడు రోజు వారీ రికార్డులను నిర్వహించలేదని ఇంజనీర్లపై సైతం కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేయడం విశేషం.

**బ్యారేజీకి సంబంధించిన స్థలాల ఎంపికను ఎవరు చేశారు?**

ప్రాజెక్టులను నిర్మించిన కంపెనీల ప్రతినిధులను కూడా ఈ కమిషన్ విచారించింది. అలాగే ప్రాజెక్ట్ డిజైన్లు చేసిన కంపెనీల ప్రతినిధులను కూడా కమిషన్ పిలిపించి విచారణ చేపట్టింది. బ్యారేజీకి సంబంధించిన స్థలాల ఎంపికను ఎవరు చేశారని ప్రశ్నించగా ప్రధానంగా గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ప్రముఖుల పేరునే అధికారులు ప్రస్తావించినట్లుగా సమాచారం. స్థలాల ఎంపిక, బ్యారేజీలకు సంబంధించి కీలక నిర్ణయాలు, చెల్లింపుల నిర్ణయాల్లో కూడా అప్పటి ముఖ్యమంత్రే ముఖ్యపాత్ర పోషించినట్టుగా అధికారులు కమిషన్‌కు ఆధారాలు అందచేశారు. ఈ నేపథ్యంలోనే మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌ల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని కమిషన్ నిర్ణయించిన నేపథ్యంలో ఈ నోటీసులు జారీ చేసినట్టుగా తెలిసింది.

**25 మంది మాజీ ఐఏఎస్‌లతో పాటు ప్రస్తుత ఐఏఎస్‌లు**

సుమారు 200 మంది అధికారులను కమిషన్ విచారించగా అందులో 25 మంది మాజీ ఐఏఎస్‌లతో పాటు ప్రస్తుత ఐఏఎస్‌లు కూడా ఉ న్నారు. వీరితో పాటు నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీకంట్రోల్, పే అండ్ అకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులతో పాటు నిర్మాణ సంస్థ ప్రతినిధులను కూడా కమిషన్ విచారించింది. ఇప్పటివరకు కమిషన్ పలువురిని విచారించి వారు అందించిన వివరాలతో ఓ నివేదికను కూడా సిద్ధం చేసింది. దీంతో మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లను విచారించాలని కమిషన్ నిర్ణయించింది. అందులో భాగంగానే వారికి నోటీసులు పంపించింది. దీంతో ఇప్పుడు కమిషన్ నిర్దేశించిన విధంగా కెసిఆర్ విచారణకు హాజరవుతారా లేక, న్యాయపరంగా అందుబాటులో ఉన్న మార్గాలను అన్వేషిస్తారా అన్నది కీలకంగా మారబోతోంది. అయితే కెసిఆర్, హరీష్, ఈటలకు నోటీసుల జారీతో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఈటల ఈ విచారణకు హాజరవుతారని ఆ పార్టీ నేతలు పేర్కొనగా కెసిఆర్, హరీష్‌రావులు హాజరవుతారా లేదా అన్న దానిపై ఉత్కంఠగా మారింది.

# జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే

1వ పేజీ తరువాయి

మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం, ఘనపూర్ గ్రామం, ఎలిగేడ్ మం డలం, ముప్పిరితోట గ్రామాల్లో భూ భారతి చట్టం -2025పై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మంత్రులు డి.శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..-ప్రతి రెవె న్యూ గ్రామంలో జూన్ 2 నుంచి రెవెన్యూ నియామకం, తహసిల్దార్ నుంచి సిసిఎల్ఎ వరకు ఐదంచెల వ్యవస్థ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పెద్దల చట్టం ధరణి, పేదల చట్టం భూ భారతి అని అన్నారు. ప్రతి రైతుకు భూ భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి చట్టం అమలు చేస్తామని అన్నారు. భూసర్వేకు 6 వేల మంది ప్రైవేట్ సర్వేయర్లను నియమించి మూడు నెలల పాటు అవసరమైన శిక్షణ అందిస్తామని అన్నారు. మండలానికి ఆరు నుండి 8 మంది సర్వేయర్లు పనిచేయమన్నారని తెలిపారు. ఈనెల 27 నుండి సర్వేయర్లకు శిక్షణ ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో 256 మంది సర్వేయర్లు ఉండగా వీరి సంఖ్యను మొదటి విడతలో 1000కి పెంచుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్ గా నిలుస్తుందని అన్నారు. 2020లో ధరణి చట్టం తెచ్చినప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల 20 వేల పైచిలుకు భూ సమస్యలు ఉండేవని తెలిపారు. చట్టంలో ఎలాంటి నిబంధనలూ లేకపోవడం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే ఉ ండేవని తెలిపారు. ధరణిలో చిన్నచిన్న పొ ర పాట్లను కూడా సవరించే అవకాశం లేకపోయిందని అన్నారు. ఎంతోమంది రైతులు న్యా య స్థానాల చుట్టూ తిరిగి అలిసిపోయారని అన్నారు. భూభారతి చట్టం ద్వారా తహసీల్దార్ స్థాయి నుండి సిసిఎల్ఏ వరకు పరిష్కారం లభించేలా నిబంధనలు పొందుపరిచామని వివరించారు.'

**10,956 గ్రామాల్లో రెవెన్యూ అధికారులు**

జూన్ 2 నుండి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి చొప్పున 10,956 గ్రామాల్లో రెవిన్యూ అధికారులు విధులు నిర్వహించనున్నారని తెలిపారు. భూభారతి చట్టం ద్వారా ప్ర భుత్వ, ప్రైవేటు సరిహద్దు పంచాయతీలు కొలిక్కి వస్తాయని అన్నారు. 18 రాష్ట్రాల్లో ఆరు నెలల పాటు పర్యటించి మంచి అంశాలను క్రోడీకరించి భూభారతి చట్టం రూపొందించామని, నియమ నిబంధనలు పొందుపరిచామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, ఎంఎల్ఏలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ-ముస్లిం రాజకీయాలే.. అన్ని సమస్యలకు మూల కారణం: కెజ్రీవాల్

**న్యూఢిల్లీ, మే, 20 (సూర్యసేన ప్రతినిధి):** గత 75 సంవత్సరాలుగా ప్రధాన పొలిటికల్ పార్టీలు ఆచరిస్తున్న హిందూ-ముస్లిం రాజకీయాలే దేశంలోని అన్ని సమస్యలకు మూల కారణమని ఢిల్లీ మాజీ సిఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మంగళవారం పార్టీ విద్యార్థి విభాగం- అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఫర్ ఆల్టర్నేటివ్ పాలిటిక్స్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. "మన దేశం చాలా సమస్యలతో సతమతమవుతోంది. ప్రజలకు ఆహారం, విద్య అందుబాటులో లేదు. ఇలా ఎందుకు జరుగుతోంది?.. ఎందుకంటే బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీలు గత 75 సంవత్సరాలుగా రాజకీయాల్లో మాత్రమే మునిగిపోయాయి" అని విమర్శించారు. "ఈ పార్టీలు మన పాఠశాల పిల్లలకు హిందూ-ముస్లిం గురించి మాత్రమే బోధిస్తున్నాయి. మన దేశంలో సమస్యలకు ఇదే మూల కారణం" అని ఆయన అన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం.. దేశ రాజధానిలో విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు.



# శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా లక్ష మల్లెల పూజ



సూర్యాపేట కల్చరల్, మే 20 (సూర్య సేన) : జిల్లా కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ హనుమ జయంతి పంచాహ్నిక ఉత్సవములలో బాగంగా మంగళవారం 3 వ రోజు వేద పండితులు దరురీ రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా లక్ష మల్లెల పుష్పార్చన నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకం నిర్వహించి, నూతన పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. స్వామి వారికి అష్టోత్తర పూజలు నిర్వహించి, వడమాల సేవ కార్యక్రమం నిర్వహించారు.దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం వద్ద సామూహిక లక్ష మల్లెల పూజల లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హనుమ జయంతి వేడుకల సందర్భంగా ధరూరి శ్రీనాథచార్యుల ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం నిర్వహించారు. దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఐదు రోజులపాటు జరుగు హనుమాన్ జయంతి వేడుకలలో బాగంగా 4 వ రోజు బుధవారం లక్ష నాగవల్లి దళార్చన( తమలపాకులతో) పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22 గురువారం 5 వ రోజు హనుమ జయంతి సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటల నుండి 108 పర్యాయములు హనుమాన్ చాలీసా పారాయణం, స్వామివారికి నిత్య ఆరాధన, ప్రత్యేక సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, నాగవల్లి దళార్చన, వెండి తమలపాకులతో అర్చన,స్వామికి ప్రత్యేక అలంకరణ నిర్వహించి పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించబడుననీ తెలిపారు. తదుపరి ఆరగింపు మంగళా శాసనం, తీర్థప్రసాద వినియోగంతో పాటు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమ జయంతి వేడుకల సందర్భంగా సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్, సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎం.పీ లక్ష్మణరావు, దరూరీ శ్రీధరాచార్యులు, ధరూరి పవన్ కుమార చార్యులు దరూరి కార్తీకా చార్యులు భక్తులు వెంపటి సురేష్ పబ్బా ప్రకాష్, పబ్బా రామమూర్తి, పురం నాగరాజు, దేవేంద్ర చారి, తొనుకునూరి వెంకటేశ్వర్లు, గజ్జి కృష్ణయ్య, బొమ్మిడి శ్రీనివాస్, రాచర్ల కమలాకర్, లింగమంతుల స్వామి దేవాలయం చైర్మన్ పోలేబోయిన నరసయ్య యాదవ్, గుండా గోపికృష్ణ,



నోముల శ్రీనివాస్, కొత్త రజిని, గుండా భవాని, నోముల విమల, కక్కిరేణి పద్మ, పోతుగంటి మల్లికార్జున్,సునీత, డాక్టర్ దుర్గాబాయి, అడ్వకేట్ రమాదేవి, బచ్చు నీరజ, గుండా సువర్ణ, పప్పా సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం లక్కవరం యూత్ అధ్యక్షుడి నియామకం



హుజూర్నగర్ ప్రతినిధి, మే 21 (సూర్య సేన) : హుజూర్నగర్ మండలం లక్కవరం గ్రామ బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడుగా కాసారపు సతీష్ ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ధూళిపాల శ్రీనివాస్ మంగళవారం హుజూర్నగర్ పట్టణంలోని బీసీ భవన్ లో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు సామాజికంగా రాజకీయంగా దక్కవలసిన వాటా దక్కలేదని, స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న తరుణంలో కూడా బీసీలు అనేక రంగాలలో వెనుకబాటుకు గురవుతున్నారు అని అన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అందవలసిన వాటా కోసం ఉద్యమించవలసిన అవసరం ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు ప్రత్యేక బడ్జెట్ని కేటాయించి అన్ని రంగాల్లో బీసీలు ముందుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బీసీలు తమ హక్కుల సాధన కోసం పోరాడే కార్యక్రమంలో భాగంగా హుజూర్నగర్ నియోజకవర్గం లోని అన్ని మండల కమిటీలు పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బొడ్డు గోవిందరావు, మండల అధ్యక్షులు గడ్డం అంజి యాదవ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గూడెపు దీప, పట్టణ ఉపాధ్యక్షులు చేపూరి నరసింహా చారి, యూత్ నాయకులు కొట్టు శేఖర్, మేకల సైదయ్య, కర్నే కృష్ణ, బ్రహ్మ చారి, శెట్టి శ్రీనివాస్, అన్నదానం గోపి,వార్డు ఇన్చార్జులు బండి నాగేశ్వరరావు, యుగంధర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో సోలార్ బ్యాటరీ యూనిట్ ప్రారంభం

**- అయిటి పాములలో మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు**

**- మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు**

**- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

నకిరేకల్/ కట్టంగూరు, మే 20 (సూర్య సేన) : కట్టంగూరు మండలంలోని అయి టిపాముల గ్రామంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో స్వబాగ్స్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటుచేసిన “స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ కో ఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్ల” ను ప్రారంభించి , స్వచ్ఛ శక్తి కేంద్రం, మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలను అందజేసి ఆయన మాట్లాడారు. సౌర శక్తి వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి చేసి ఆదాయం సంపాదించుకునేందుకు



దేశంలోనే మొట్ట మొదటిసారిగా అయిటిపాములలో మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. “అమెరికా, జపాన్ లాంటి దేశాలు న్యూక్లియర్ ,థర్మల్ విద్యుత్తును పక్కన పెట్టి సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి వెళుతున్నారని, దాన్ని దృష్టిలో ఉంచుకొని మహిళలు ఇంటి వద్దనుండే ఆదాయం పొందేందుకు సోలార్ విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో మహిళలను లక్షాధికారులుగా చేయాలనే ఆలోచనతో ఆర్థిక సాయం అందించడం జరిగిందని, అదే సమయంలో తాను శాసనసభ్యుడిగా మహిళా స్వయం సహాయక సంఘాలకు 350 కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, స్వశక్తితో మహిళలు పైకి రావాలనే ఉద్దేశంతో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 50 మంది స్వయం సహాయక మహిళలకు 50 లక్షల రూపాయలను ఇచ్చి యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు .అలాగే త్వరలోనే ఈ 50 మంది మహిళలకు బ్యాంకుల ద్వారా మూడు లక్షల రూపాయల చొప్పున బ్యాంకు రుణాలను ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగ యువతకు ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయలు చొప్పున జూన్ 2 న స్వయం ఉపాధి కై ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు.రానున్న రెండు నెలల్లో” తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కట్టంగూరు మండలంలోని అయి టిపాముల గ్రామంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో స్వబాగ్స్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటుచేసిన “స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ కో ఆపరేటివ్ సోలార్







బ్యాటరీ యూనిట్ల” ను ప్రారంభించి , స్వచ్ఛ శక్తి కేంద్రం, మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలను అందజేసి ఆయన మాట్లాడారు. సౌర శక్తి వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి చేసి ఆదాయం సంపాదించుకునేందుకు దేశంలోనే మొట్టమొదటిసారిగా అటిపాములలో మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఐటిపాములలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ బ్యాటరీలను ఇన్స్టిట్యూషనలైజేషన్ చేసేందుకు ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ,నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, డి సి ఎం ఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి, ఇంచార్జ్ రెవిన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,మండల ప్రత్యేక అధికారి ,జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, స్వేచ్ఛ శక్తి కేంద్ర సిఈఓ సుధాకర్ తహసిల్దార్ ప్రసాద్ , ఎఫ్ పిఓ చైర్మన్ చౌగాని సైదమ్మ మాజీ ఎంపీపీలు రెడ్డిపల్లి వెంకటమ్మ సాగర్, కొండ లింగస్వామి మాజీ జెడ్పిటిసిలు సుంకరబోయిన నరసింహ, మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ ప్రసాద్ సాగరపుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయ రత్న అవార్డు అందజేత

**- మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు**

సూర్యాపేట టౌన్, మే 20 (సూర్య సేన) : నిరంతరం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ న్యాయవాది డాక్టర్ సగరపు ప్రసాద్ అభినందనీయుడని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మోత్కుపల్లి నరసింహులు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవం 2025 సందర్భంగా పలు సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ సగరపు ప్రసాద్ కు సామాజిక న్యాయ రత్న అవార్డు మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నరసింహులు చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా మోత్కుపల్లి నర్సింలు మాట్లాడుతూ డాక్టర్ సగరపు ప్రసాద్ సేవలను కృషిని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుతో సత్కరిస్తుందని గుర్తు చేశారు. ఆత్మగౌరవం కోసం కొనసాగిస్తున్న పోరాటానికి గుర్తింపుగా అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం డాక్టర్ ప్రసాద్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా



తెలంగాణ రాష్ట్ర సామాజిక న్యాయ రత్న అవార్డు గ్రహీత డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పేద ప్రజల అభివృద్ధి కోసం గాను నిరంతరం శ్రమిస్తున్న సందర్భంగా ప్రభుత్వం గుర్తించి నాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటిక రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొంతమంది శ్రేయోభిలాషులు ప్రసాద్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే గుణాత్మక విద్య



**- మండల విద్యాశాఖ అధికారి ఛత్రునాయక్**

గరిడేపల్లి ప్రతినిధి, మే 20 (సూర్య సేన) : మండల కేంద్రమైన గరిడేపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉత్సాహపూరిత వాతావరణంలో మండలంలోని ఉపాధ్యాయులకు (%ాఖీూ ఎవీ,ా+ు%) లకు 5 రోజుల వృత్యంతర శిక్షణా కార్యక్రమం ను పానుగోతు ఛత్రు నాయక్ ప్రారంభించారు.. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన మండల విద్యాధికారి పానుగోతు ఛత్రు నాయక్ సార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లలోనే బడుగు,బలహీన వర్గాలకు ఉచిత గుణాత్మక విద్య అందిస్తున్నామని చెప్పారు.అందులో భాగంగా ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాలు పెంపొందించుటకు 5 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ బడిలోనే అందుతుందని తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా చదువులో వెనుకబడి ఉన్న చివరి విద్యార్థి కనీస సామర్థ్యాలు సాధించే విధంగా మనమందరం కృషి చేయాలని,విద్యార్థులకు ఆనందదాయమైన బోధన అందించాలని అన్నారు. ఈ సందర్భంగా కీతవారి గూడెం పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ మేడం మాట్లాడుతూ మన మండలంలో ప్రతి టీచర్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నారని అభినందిస్తూ ఈ శిక్షణ ద్వారా చక్కని బోధనా మెలకువలు నేర్చుకొని జిల్లాలో మన మండలాన్ని విద్యలో ఆదర్శంగా నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ రాజశేఖర్,దయాకర్ ,%ాఖీూ% ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి,బాల సైదిరెడ్డి,చంద్రయ్య, హైమవతి, పద్మ, బాలస్వామి,సైదులు,రవినాయక్,శ్రీనివాస్ రాజు, లక్ష్మయ్య,శ్రావణి,శిరీష,సుజాతమండల తెలుగు నాగేశ్వర్ రావు, రవీందర్, ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్స్ పాపయ్య,నాగేశ్వర్ రావు,గణిత రిసోర్స్ పర్సన్స్ కోటేశ్వర్ రావు,%ూ%. రాంబాబు,పరిసరాల విజ్ఞానం రిసోర్స్ పర్సన్స్ బేతు సైదులు,రావుల రాంబాబు, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్ రాములు,అశోక్,ఉమ, రామకృష్ణ,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి





**- టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి**

**- మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చెయ్యొద్దు**

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట / తుంగతుర్తి / నూతనకల్, మే 20 (సూర్య సేన) : ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం జిల్లా తేజస్ నంద్ లాల్ పవార్ నూతనకల్,తుంగతుర్తి, మద్దిరాల మండలం పోలుమళ్ళ, రామచంద్రపురం జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి,తిమ్మాపురం -2,సూర్యాపేట మండలం ఎర్కారం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యంలో తాలు, గడ్డి లేకుండా తూర్పలా పోస్తేనే ధాన్యం నాణ్యతగా ఉంటాయని అన్నారు. ఆకాల వర్షాలకి వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని కాంటా వేయగానే వెంటనే ధాన్యం లారీలకి లోడ్ చేయాలని తెలిపారు.లారీలను సర్దుబాటు చేస్తామని అలాగే మీకు అందుబాటులో ఉన్న లారీలను సర్దుబాటు చేసుకోవాలని సాధ్యమైనంత తొందరగా కేంద్రాలలో ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాలను ముసివేయాలని సూచించారు.రైతులతో మాట్లాడుతూ రెండు మూడు రోజులలో అన్ని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని రైతులకి భరోసానిచ్చారు. ఆయా కేంద్రాలలో రికార్డులను పరిశీలించి ఎన్ని లోడ్లు తరలించారు ఇంకా ఎన్ని లోడ్లకి సరిపోను ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉందని నిర్వాహకులని అడిగి తెలుసుకున్నారు.నూతనకల్ ఐకేపీ నుండి 8145 క్వింటాలు, మద్దిరాల నుండి 4500 క్వింటాలు, జాజి రెడిగూడెం మండలం అర్వపల్లి యన్ డి సీ యం నుండి 8000 క్వింటాలు, ఐకేపీ తిమ్మాపురం నుండి 8400 క్వింటాలు, తుంగతుర్తి ఉమెన్స్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ నుండి



6200 క్వింటాలు సూర్యాపేట మండలం ఎర్కారం పి ఏ సీ ఎస్ నుండి 21,400 క్వింటాలు ధాన్యం మిల్లులకి ఎగుమతి చేయటం జరిగిందని తెలిపారు. తదుపరి సూర్యాపేట మండలం బాలెంల లోని వజ్ర రైస్ ఇండస్ట్రీస్, పెన్ పహాడ్ మండలం మాచారం లోని వెంకటసాయి రైస్ ఇండస్ట్రీస్ ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లు ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని ఎప్పటికప్పుడు జాప్యం చేయకుండా ధాన్యం దిగుమతి చేసుకోని లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సివిల్ సప్లై కార్పొరేషన్ డియం ప్రసాద్, తహసీల్దార్లు శ్రీనివాసరావు, అమీన్ సింగ్,రాం ప్రసాద్,లాల్ నాయక్, ఎంపిడిఓ సునీత, ఎ ఓ మురళి బాబు,ఏ పి యం రాంబాబు, ఏ ఈ ఓ సత్యం, ఇంచార్జి లు నాగార్జున, ముత్తయ్య,సురేష్,సంఘం సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

**- సిఐటియు జిల్లా నాయకులు ఎండి పాషా, ఆదిమూలం నందీశ్వర్**

చౌటుప్పల్ ప్రతినిధి, మే 20 (సూర్య సేన) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్ హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బ్రిటిష్ కాలంలో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకురావడం జరిగింది. వీటివల్ల కార్పొరేట్ శక్తులు పెట్టుబడిదారీ వర్గాలకే లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని అన్నారు. కావున వెంటనే ఈ నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, రాజ్యాంగం కల్పించిన



ప్రాథమిక హక్కులను రక్షించాలని, కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, కార్మిక సంఘా రిజిస్ట్రేషన్ ను 45 రోజుల వ్యవధిలో చేయాలని, సందర్భంగా డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బత్తుల దాసు, గడ్డం వెంకటేశం, జొన్న కంటి దేవయ్య, కలకుంట్ల శివకుమార్, బోయ యాదయ్య, ఎస్.కె మదర్, కొంతం శ్రీనివాస్ రెడ్డి,ఈదుపులకంటి కిష్టయ్య, పారమళ్ళ లక్ష్మయ్య, యాదమ్మ, గజ్జల రాజు, బక్క బాలమ్మ, కంకల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

బుధవారం, మే 21, 2025

## ఇకనైనా మేల్కొనాలి

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది పసిపిల్లలతో సహా పదిహేడు మంది ప్రాణాలు అందులో కాలి బూడిదయ్యాయి. ఈ వార్త వినగానే మన గుండె ఎంత బరువెక్కిందో కదా? దేశంలో వేగంగా పెరుగుతున్న నగరాలు ఇలాంటి విపత్తులకు ఎందుకు నిలయంగా మారుతున్నాయి అనేది మనం తప్పకుండా ఆలోచించాల్సిన విషయం. ఇవి కేవలం అనుకోకుండా జరిగే ప్రమాదాలు అనుకుంటే పొరపాటే. తరచుగా ఇవి మన నియంత్రణలో, వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగానే జరుగుతాయి. వీటి వెనుక చాలా కారణాలున్నాయి. భవన నిర్మాణ నిబంధనలు సరిగా పాటించకపోవడం, మౌలిక సదుపాయాల కొరత, అజాగ్రత్త, బాధ్యతారాహిత్యం ఇవన్నీ కలిసి ఒక విషాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఇలాంటి విపత్తులనుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు కాలిపోతున్నాయో లోతుగా అర్థం చేసుకోవాలి. మనం భవనాలను ఎలా కడుతున్నామో, ఎలా వాటిని పర్యవేక్షిస్తున్నామో, వాటిలో ఎలా నివసిస్తున్నామో అనే దానిపై సమూల మార్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మంటలు అంటుకోవడానికి కారణాలు చూస్తే సాధారణంగా మనకు ముందుగా వినిపించేవి ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌లు. పాతబడిపోయిన వైరింగ్, సరిగా నిర్వహించని విద్యుత్ వ్యవస్థలు, అవసరానికిమించి భారం మోస్తున్న సర్క్యూట్లు, నాణ్యతలేని వైర్లు, శిక్షణలేని వ్యక్తులు చేసే మరమ్మతులు. ఇవన్నీ షార్ట్ సర్క్యూట్లకు దారితీస్తాయి. మనం ఉండే ఇంట్లో పనిచేసే చోట ఎలక్ట్రికల్ వైరింగ్ ఎలా ఉంది?ఎప్పుడైనా తనిఖీ చేయించామా? ఈ చిన్న విషయాలే పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయి. అలాగే వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, పాడైపోయిన రెగ్యులేటర్లు లేదా గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే వస్తువులను –పెయింట్స్, ప్లాస్టిక్, రసాయనాలు వంటివి %–% జాగ్రత్త లేకుండా ఇంట్లోనో, దుకాణాల్లోనో నిల్వచేయడం చాలా ప్రమాదం. వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సిగరెట్లు తాగేటప్పుడు నిర్లక్ష్యంగా ఉండటం వంటి చిన్నచిన్న పొరపాట్లు కూడా క్షణాల్లో పెద్ద మంటలకు కారణమవుతాయి. మన నగరాలు చాలా వేగంగా పెరుగుతున్నాయి. కానీ ఆ పెరుగుదల ప్రణాళికాబద్ధంగా లేదు. దీనివల్ల జనసాంద్రత విపరీతంగా పెరిగిన్నది. కింది అంతస్తులో దుకాణాలు, పైన నివాసాలు ఉండే భవనాలు మనం చూస్తేనే ఉన్నాం. వీటిలో ఒకదానికొకటి అంటుకునే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా పాత నగరాలలోని ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలు, అగ్నిమాపక వాహనాలు వెళ్లడానికి, రెస్క్యూ సిబ్బంది పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తాయి. అక్రమ నిర్మాణాల సంగతి చెప్పనక్కర్లేదు. అవి అత్యవసర మార్గాలను మూసివేస్తాయి. భవనాలను మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. సరైన నిష్క్రమణ మార్గాలు లేకపోవడం వల్ల మంటలు చెలరేగినప్పుడు బయటపడటం కష్టమవుతుంది. మనకు అగ్ని భద్రతా నియమాలు లేవా? అంటే ఉన్నాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్ వంటివి, రాష్ట్రాల అగ్నిమాపక చట్టాలు భవనాలను ఎలా కట్టాలో, ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోవాలో చెబుతాయి. కానీ వీటి అమలులో తీవ్రమైన లోపాలున్నాయి అనేది ఒప్పుకోవాల్సిన నిజం. తనిఖీలు చేసే అధికారులు సరిపోవడం లేదు. వారికి అవసరమైన ఆధునిక పరికరాలు లేవు. అనుమతులు, తనిఖీల ప్రక్రియ చాలా జాప్యంతో కూడుకున్నది లేదా అవినీతికి తావు ఇస్తుంది. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. జరిమానాలు అంత ఎక్కువగా ఉండవు, కేసులు నెమ్మదిగా నడుస్తాయి. తప్పనిసరిగా ఉండాల్సిన ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు లేకుండానే అనేక భవనాలు పనిచేస్తున్నాయి. భవనాలను కట్టే కొందరు వ్యక్తులు ఖర్చు తగ్గించుకోవడానికి నిబంధనలను పాటించరు. భద్రత కంటే డబ్బుకే ప్రాధాన్యత ఇస్తారు. ఇంకా చెప్పాలంటే భద్రత పట్ల నిర్లక్ష్యం అనేది ఒక సంస్కృతిగా మారిపోయింది. భవనాలలో నివసించే వారికి, పనిచేసే వారికి అగ్నిప్రమాదం వస్తే ఏం చేయాలో, అత్యవసర మార్గాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు. అగ్నిప్రమాద పరికరాలు ఉన్నా ఎలా వాడాలో తెలీదు. రెగ్యులర్ ఫైర్ డ్రిల్స్ ప్రైవేట్ భవనాలలో చాలా అరుదు. ప్రభుత్వాలు, అధికారులు, భవనాల యజమానులు, అందులో నివసించే ప్రజలు అందరూ తమ బాధ్యతను నిర్వర్తించాలి. ముందుగా చట్టాలను కఠినంగా అమలు చేయాలి. కేవలం చట్టాలు ఉండటం కాదు, వాటిని అమలు చేసే యంత్రాంగం బలంగా ఉండాలి. అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయాలి. ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇరుకైన ప్రదేశాలకు వెళ్లగలిగే చిన్న ఫైర్ టెండర్లు వంటివి వారికి అందించాలి. యజమానులు, నిర్వాహకులు తమ భవనాలలో అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించే బాధ్యతను తీసుకోవాలి. విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, నిర్వహణ చేయించాలి. అగ్ని ప్రమాదం వస్తే ఎలా వ్యవహరించాలో అక్కడ నివసించే వారికి, పనిచేసే వారికి శిక్షణ ఇవ్వాలి. భద్రతా లోపాలు కనిపిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలి. అభివృద్ధి చెందుతున్నామని సంతోషిస్తున్నాం కానీ, భద్రత పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఇలాంటి ప్రాణ నష్టం జరుగుతుంది.

సూర్యసేన
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9951241048

# దౌత్యబృందాల్లో రాజకీయం!



పహల్గాం ఘటన అనంతరం పాకిస్తాన్ భరతం పట్టేందుకు, సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ఆ దేశం వైఖరిని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టేందుకు భారత్ వ్యూహాత్మకంగా ముందుకు కదులుతోంది. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేయడం, పాక్‌తో వాణిజ్య, వ్యాపార ఒప్పందాలను తెగతెంపులు చేసుకోవడం, దేశంలో తిష్ఠవేసిన పాకిస్తానీయులను వెనక్కి పంపించడం వంటి చర్యలు చేపడుతూనే దాయాది దేశంలోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసింది. ఒకవిధంగా పాకిస్తాన్‌ను అష్టదిగ్బంధం చేసేందుకు పావులు కదుపుతోంది. విదేశాలకు ప్రతినిధి (%×అఌఖు ఙఌఞూశ్రీశీఫ్‌%) బృందాలను పంపించాలని నిర్ణయించడం అందులో భాగమే. వివిధ దేశాలలో ప్రభుత్వాధినేతలను కలసి, ఆపరేషన్ సిందూర్ గురించి వివరించడంతోపాటు ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాక్ నిర్వాకాన్ని వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. సుమారు ఎనిమిదిమంది చొప్పున సభ్యులుగల ఈ బృందాలు ఆయా దేశాల రాజధానులకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఒక విధంగా ఉగ్రవాదంపై అలుపెరగని పోరాటం చేస్తున్న భారత్‌కు అంతర్జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టడంతోపాటు పాక్‌ని ఏకాకిని చేయడం ఈ వ్యూహంలో భాగం. అయితే, అఖిలపక్ష ప్రతినిధి బృందాల రూపకల్పన వివాదాస్పదం కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రతినిధి బృందాలలో ఒక దానికి తమ పార్టీ సీనియర్ నేత శశిథరూర్‌ను ఎంపిక చేయడం కాంగ్రెస్‌కు కంటగింపుగా మారింది. వాస్తవానికి విదేశాలకు పంపే ప్రతినిధి బృందాలకోసం పార్టీ నేతల పేర్లు ఇవ్వాలన్న కేంద్రం కోరికపై కాంగ్రెస్ ఎంపిక చేసిన నలుగురిలో శశిథరూర్ పేరు లేదు. ఆనంద్ శర్మ, గౌరవ్ గొగోయ్, సయ్యద్ నసీర్ హుసేన్, అమరీందర్ రజా పేర్లను కాంగ్రెస్ ఇవ్వగా, ఆనంద్ శర్మ ఒక్కరినే పరిగణనలోకి తీసుకున్న కేంద్రం, మిగిలిన ముగ్గురినీ తన ఇచ్ఛమేరకే ఎంపిక చేసింది. దీనినిబట్టి కేంద్రం ముందుగానే పేర్లను నిర్ణయించుకుని, కంటితుడుపుగా తమను పేర్లు అడిగినట్లు స్పష్టమవుతోందన్న కాంగ్రెస్ విమర్శలో హేతుబద్ధత లేకపోలేదు. అదే సమయంలో ఉత్తమ పార్లమెంటేరియన్ గా, చక్కటి వాగ్ధాటి కలిగిన నేతగా, అంతర్జాతీయ వేదికలపై భారత్ తరఫున తడుముకోకుండా మాట్లాడే తిరుగులేని వక్తగా పేరొందిన శశిథరూర్ పేరును కాంగ్రెస్ ఎందుకు ప్రతిపాదించలేదు? దీనికి కారణాలు లేకపోలేదు. గత కొంతకాలంగా శశిథరూర్ కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టుగా ఉంటూ, బిజెపికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. మోడీ సమర్థుడైన నేత అని, ఆయన నాయకత్వం దేశానికి అవసరమని శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు సహజంగానే కాంగ్రెస్‌కు ఆగ్రహం తెప్పించాయి. దానికితోడు ఇటీవల తిరువనంతపురంలో జరిగిన విజింజం ఓడరేవు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ ఒకే వేదికపై తాను, శశిథరూర్ పాల్గొనడాన్ని చూసిన కొందరు కాంగ్రెస్ నేతలకు ఇక నిద్రపట్టదంటూ చేసిన వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోశాయి. ఈ వివాదాలు ఎలా ఉన్నా, అంతర్జాతీయ స్థాయిలో భారత్ వైఖరిని విప్పిచెప్పేందుకు వెళ్లే ప్రతినిధి బృందాలకు దీటైన నేతలను పంపించడం ఆయా పార్టీల బాధ్యత. వాస్తవానికి కాంగ్రెస్ ప్రతిపాదించిన నేతలందరూ సమర్థులే అయినా, వారందరూ సీనియర్ రాజకీయ నేత, రచయిత, మాజీ దౌత్యవేత్త అయిన శశిథరూర్ తరువాతేనని చెప్పవచ్చు. ఆయన ప్రస్తుతం విదేశీ వ్యవహారాల కమిటీకి చైర్మన్ గానూ వ్యవహరిస్తున్నారు. గతంలో ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ పదవికి పోటీ పడ్డారనే సంగతి విస్మరించకూడదు. బిజెపి శశిథరూర్‌ను ఎంపిక చేయడం ద్వారా స్వామికార్యంతోపాటు స్వకార్యాన్ని కూడా నెరవేర్చుకోగా, కాంగ్రెస్ పరిస్థితి కుడితిలో పడిన ఎలుక చందంగా మారింది. శశిథరూర్ లాంటి ప్రతిభావంతుడిని ఎంపిక చేయకపోవడానికి సరైన కారణాలు చెప్పలేని స్థితిలో ఆ పార్టీ కేంద్రం వైఖరిని తూలనాడటమే పనిగా పెట్టుకుంది. అదే సమయంలో కాంగ్రెస్‌లో ఉండటం వేరు, కాంగ్రెస్‌తో ఉండటం వేరు అంటూ శశిథరూర్‌ను ఉద్దేశించి పార్టీ వ్యాఖ్యలు వాస్తవంగా తోస్తాయి. శశిథరూర్ కాంగ్రెస్‌లో ఉంటూ ఎన్నో పదవులు పొందారు. ఇప్పటికీ పార్టీలో ఆయన కీలకమైన అగ్రనేతల్లో ఒకరిగా కొనసాగుతున్నారు. అలాంటి వ్యక్తి పార్టీ మారాలని అనుకుంటే, ముసుగులో గుద్దులాటలు దేనికి? హుందాగా తన పదవికి రాజీనామా చేసి, కమలనాథుల పంచన చేరితే కాదనేవారెవరు? దేశప్రతిష్ఠను ఇనుమడింపజేసేందుకు ఉద్దేశించిన అఖిలపక్ష బృందాల ఎంపిక విషయంలో రాజకీయ విభేదాలు, స్వార్థ ప్రయోజనాలు తెరపైకి రావడం గర్హనీయం.

# హిమంత పాలనలో నేరాల చిక్కుముడి



అసోంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలో ప్రభుత్వం నేరాల రేటును తగ్గించడంలో గణనీయమైన పురోగతి సాధించిందని తరచు చెబుతూనే ఉంది. ఇందుకు బలమైన పోలీసింగ్ చర్యలను ఉటంకిస్తోంది. అయితే, ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లో పహల్గాంలో టెర్రరిస్ట్ దాడి వంటి సంఘటనల తర్వాత అసమ్మతి వ్యక్తం చేసిన వారి అరెస్టులతోపాటు, శాంతిని గొప్పగా ప్రదర్శించడానికి కొద్దిగా మాత్రమే కేసుల నమోదును రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోందని ఆరోపణలు వచ్చాయి. అందువల్ల స్పష్టమైన చిత్రం తెలియాలంటే, అసోం లో నేరాల ధోరణులు, ప్రభుత్వ విధానాలు, దాని చర్యల సామాజిక చిక్కులను విమర్శనాత్మకంగా పరిశీలించాలి. అందుకు అందుబాటులో ఉన్న డేటా, నివేదికలే వాడుకోవాలి. అసోంలో నేరాల రేటు తగ్గుదల గురించి ముఖ్యమంత్రి బిశ్వ శర్మ పదేపదే హైలైట్ చేశారు. ఆయన ప్రకటన ప్రకారం లక్ష జనాభాకు నేరాల రేటు 2020లో 349 ఉండగా, 2024లో 139కి తగ్గింది. అంటే 60% తగ్గిందన్నమాట.

మొత్తం నమోదైన క్రిమినల్ కేసులు 2020లో 1,21,609 ఉంటే, 2024లో 50,215 కి తగ్గాయని అదేకాలంలో చార్జిషీట్ రేటు 44.8% నుంచి 66.7 శాతానికి, నేరారోపణ రేటు 5.5% నుంచి 25 శాతానికి పెరిగిందని తెలుస్తోంది. మహిళలపై నేరాలు బాగా తగ్గాయి. 2020లో 26,352 కేసులు ఉండగా, 2024లో 5,555కి తగ్గాయి. బాల్యవివాహాలను కఠినంగా అరికట్టారు. కేసుల నమోదు 2020లో 138 నుంచి 2023 లో 5,498కి పెరిగాయి. అదనంగా అసోం పోలీసులు 2020 నుంచి రూ. 2,885 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. 2024లోనే 3,323 మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు నమోదు చేశారు. అయితే ఈ గణాంకాలపై వివాదాలు లేకపోలేదు. నమోదైన కేసుల సంఖ్య తగ్గుదల, వాస్తవంగా జరిగిన నేరాల కంటే తక్కువగా ఈ నివేదికలు ఉన్నాయని విమర్శకులు వాదిస్తున్నారు.

నేరాల సంఖ్యలను తగ్గించి, కేసుల నమోదునూ పరిమితం చేయాలని పోలీసు స్టేషన్లకు ముందే సూచించారనే ఆరోపణలున్నాయి. ఇది సెలెక్టివ్ పోలీసింగ్‌పై వ్యక్తమవుతున్న ఆందోళనలకు అద్దంపడుతోంది. ఉదాహరణకు 2024 నివేదిక ప్రకారం శర్మ పదవీకాలంలో మొదటి 15 నెలల్లో 171 కేసులు నమోదయ్యాయి. ఫలితంగా 56 మంది మరణించారు. 139 మంది గాయపడ్డారు. అయితే చట్టవిరుద్ధమైన చర్యలు, నేరాల నివేదికలపై వాటి ప్రభావం గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రశాంత భూషణ్ వంటి న్యాయవాదులు నకిలీ ఎన్‌కౌంటర్‌లు అని విమర్శించిన ఈ ఎన్‌కౌంటర్లు, దొంగతనం, గృహహింస లేదా దోపిడీ వంటి రోజువారీ నేరాల దర్యాప్తును తప్పుదోవపట్టిస్తున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు పరిశీలన, అసోంలో చట్టం అమలులో పారదర్శకతను, జవాబుదారీతనంతో తలెత్తే సమస్యలను నొక్కి చెబుతోంది. అంతే కాకుండా, మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వం ప్రకటిస్తుండగా, 2025 మొదటి రెండు నెలల్లో అసోంలో 121 అత్యాచార కేసులు నమోదయ్యాయి. 2024లో 1,019 కేసులు, 2023లో 989 కేసులు, 2022 లో 1,113 కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్యలు 2021, 2020లో వరుసగా 1,733, 1657 కేసుల కంటే తక్కువగా ఉన్నప్పటికీ, మహిళలపై నేరాలు నిరంతర సవాలుగా కొనసాగుతున్నాయని సూచిస్తున్నాయి. బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం ప్రశంసనీయమే. అయినా, ముఖ్యమైన సమస్యలను మరుగున పడేటట్లు చేస్తోంది. ఉదాహరణకు అసోంలో సంభవించిన వరదలలో 2024లో 113 మంది చనిపోగా, 3.3 మిలియన్ల మందిని ప్రభావితం చేసింది. విస్తృత ప్రజాభద్రతా చర్యల అవసరాన్ని హైలైట్ చేస్తోంది. పోలీసులు కేవలం రాజకీయ భద్రతలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు కన్పిస్తోంది. ఈ వక్రీకరణ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. ప్రజల భద్రత కన్నా విమర్శకుల నోరు మూయించడంపైనే పోలీసులు ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారని అనిపిస్తోంది. పహల్గాం ఊచకోత, సామాజిక సమీకరణలు జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న టెర్రరిస్టుల దాడి, 26 మంది పౌరులు, ముఖ్యంగా హిందూ పర్యాటకుల హత్య అసోం లో తీవ్రప్రభావాన్ని చూపింది.

లష్కరే తోయిబా అనుబంధ సంస్థగా అనుమానిస్తున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) దుండగులు జరిపిన దాడి దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రగిల్చింది. భద్రతా చర్యల సమీక్షను తీవ్రతరం చేసింది. అసోంలో ప్రభుత్వం తన సంతాపాన్ని వ్యక్తం చేయడమే కాక, బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించింది. అయితే, ఈ దాడికి సంబంధించి జాతీయ వ్యతిరేక ప్రకటనలు, పాక్ అనుకూల ప్రకటనలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు వివాదాస్పదంగా మారాయి. ఏప్రిల్ 28వ తేదీలోగానే పాక్‌ను సమర్థించిన లేదా ప్రభుత్వ భద్రతా చర్యలను విమర్శించినందుకు అసోం పోలీసులు ఎఐయుడిఎఫ్ ఎంఎల్ఎ అమీనుల్ ఇస్లాం సహా 27 మందిని అరెస్ట్ చేశారు. పహల్గాం, 2019 పుల్వామా దాడులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలు అని ఆరోపించినందుకు ఇస్లాంపై దేశద్రోహం కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ధధీచి డింపుల్ వంటి వ్యక్తులను అదుపులోకి తీసుకోవడమే కాక, పలువురిని అరెస్ట్ చేశారు.

ముఖ్యమంత్రి శర్మ ఈ అరెస్టులను సమర్థించుకుంటూ, అసోం సర్కార్ పాక్‌కు మద్దతు ఇవ్వడాన్ని సహించబోదని, నేరాలకు అలవాటుపడిన వారిపై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ)ను ప్రయోగిస్తుందని స్పష్టంగా ప్రకటించారు. ప్రభుత్వం ఈ అరెస్టులను, అసమ్మతివాదులను అణచివేసేందుకు, ముఖ్యంగా ముస్లింలను టార్గెట్ చేసుకుని సామాజిక విభజనను పెంచుతోందని, దీని ద్వారా సామాజిక అంతరాలను మరింత పెంచుతోందని సోషల్ మీడియాలో విమర్శకులు ఆరోపించారు. సిఎం శర్మ చర్యలు దుర్మార్గపు ఇస్లామోఫోబియాను ప్రతిబింబిస్తున్నాయని, 58 అరెస్టులు యుద్ధ వ్యతిరేక వ్యాఖ్యలు, ప్రభుత్వ విమర్శలకు సంబంధించినవని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ లెక్కలపై స్వతంత్ర ధ్రువీకరణలు లేకపోయినా అతిని హైలైట్ చేస్తోంది. ఇక్కడ భిన్నాభిప్రాయాలను జాతివ్యతిరేకత ముద్రవేస్తున్నారు. విమర్శకులను దేశద్రోహులుగా చిత్రీకరించే శర్మ వాక్చాతుర్యం మెజారిటీ భావాలను ప్రోత్సహించవచ్చు. సుప్రీం కోర్టు దేశద్రోహం ఆరోపణలకు సంబంధించి నిర్దుష్టమైన పరిమితులు పేర్కొంది. హింసను ప్రేరేపించినట్లు ఉంటేనే దేశద్రోహంగా భావించాలని పేర్కొంది.

కానీ, పోలీసులు ఈ అంశంతో సంబంధం లేని కేసులలో అభియోగాలు నమోదు చేస్తూనే ఉన్నారు. పహల్గాం దుర్ఘటన తర్వాత 2025లో జరిగిన అరెస్టులు యుద్ధ వ్యతిరేక లేదా శాంతి కోరుకునే వాదనతో కూడిన వ్యాఖ్యలతో సహా అన్నీ దేశ వ్యతిరేక కార్యకలాపాలుగానే పరిగణించడాన్ని సూచిస్తున్నాయి. ఇది భావప్రకటనా స్వేచ్ఛపై అంతర్జాతీయ ప్రమాణాలను ఉల్లంఘించడమే. అసోంలోని విభిన్న వర్గాలను ఏకంచేయాలనే శర్మ వాదన, ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి లక్ష్యాలకు విరుద్ధంగా ఉంది. స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రం భావనలపై అణచివేత, నేరాలను తగ్గించి చూపే నివేదికలు, ప్రజాస్వామ్య సూత్రాలను దెబ్బతీసి, 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించే ప్రమాదం ఉంది. అసోం ఎంతో శాంతియుతంగా ఉందని చిత్రీకరించేందుకు, కొన్ని కేసులను నమోదు చేయవద్దని ఆదేశాలు వచ్చాయనే ఆరోపణ ఆందోళన కలిగిస్తోంది.

అందిన డేటా ఈ అంశాన్ని నిర్ధారించకపోయినా, నమోదైన కేసులు మాత్రం బాగా తగ్గాయి. 2020లో 1,21,609 కేసులు నమోదైతే, 2024లో 50,215 కేసులో నమోదు కావడం నిజంగా కేసులు తగ్గాయా లేక కొన్ని కేసులనే నమోదు చేస్తున్నారనే వాదనను ప్రతిబింబిస్తున్నదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2022 ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం అసోంలో నేరాల రేటు పెరగడానికి కారణం ముఖ్యంగా మహిళలపై నేరాల సంఖ్య పెరగడం. గతంలో డేటా వాస్తవ నేరాల స్థాయిని సూచిస్తోంది. అకస్మాత్‌గా నేరాల తగ్గుదల ఫిర్యాదులను బాగా వడపోస్తున్నారని సూచిస్తోంది. ముఖ్యంగా చిన్న నేరాలను నమోదు చేసి ఉండకపోవచ్చు. ఇదే నిజమైతే పోలీసులు, ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటుంది.బాధితులు నేరాలపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేయవచ్చు. ఎందుకంటే వారి కేసులను నమోదు చేయకపోవచ్చు. ఫలితంగా రిపోర్ట్ కాని నేరాల సంఖ్యపెరిగి అడ్డూఆపూ లేని నేరాలకు దారితీయవచ్చు.

అసోం సిఎం శర్మ పాలనలో నేరాల తగ్గింపు వ్యూహానికి మూలస్తంభం బలమైన, రాజీలేని పోలీసింగ్ అని స్పష్టమైంది. ఇందులో అక్రమరవాణాదారుల నుంచి స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విధ్వంసం వంటి కార్యక్రమాలు హైలైట్. 2021లో మాదకద్రవ్యాలపై బుల్డోజర్ నడపడం వంటి కార్యక్రమాలలో సిఎం వ్యక్తిగతంగా పాల్గొన్నారు. తరచు నిర్దిష్ట వర్గాలకు చెందిన నేరస్థులను లక్ష్యంగా చేసుకుంటూ పోలీసులు సాగించిన ఎన్‌కౌంటర్ల సరళి మానవ హక్కులకు పాల్పడ్డారనే విమర్శలకు తావు ఇచ్చింది. 2021లో జాతీయ మానవహక్కుల కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదులో అసోం పోలీసులు నకిలీ ఎన్‌కౌంటర్లు చేశారని, నిర్బంధించిన వారిని అనుమానాస్పద పరిస్థితుల్లో కాల్చి చంపారనే ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం దూకుడు వైఖరి కొన్ని నేరాల సంఖ్య తగ్గించడంలో ప్రభావం చూపినా, ప్రజల్లో అపనమ్మకాన్ని పెంచవచ్చు.

సమాజాలనూ దూరం చేయవచ్చు. పహల్గాం దాడి తర్వాత జరిగిన అరెస్టులు, ముఖ్యంగా ముస్లింలు, ప్రతిపక్ష నాయకుల అరెస్టులు, రాజకీయ దురుద్దేశంతో చేసినవేననే విమర్శలు వచ్చాయి.

# ఘనంగా మాజీ కౌన్సిలర్ గోపగోని లక్ష్మణ్ గౌడ్ జన్మదిన వేడుకలు



**చౌటుప్పల్ ప్రతినిధి, మే 20 (సూర్య సేన) :** చౌటుప్పల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సిపిఎం పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ గోపగోని లక్ష్మణ్ గౌడ్ జన్మదిన వేడుకలను చౌటుప్పల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం గోపగోని లక్ష్మణ్ గౌడ్ ని పూలమాలతో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చౌటుప్పల్ మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ గా గోపగోని లక్ష్మణ్ గౌడ్ వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. మునుముందు రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించమని తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు కలకాలం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జరుపుకోవాలని వారిని ఆశీర్వదించారు.సన్మానించిన వారిలో చౌటుప్పల్ మాజీ ఉపసర్పంచ్ అనమోని గోవింద్ రాజు, శివాజీ యూత్ అధ్యక్షులు గుజ్జుల సురేందర్ రెడ్డి, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బండారు నరసింహ, దండ అరుణ్ కుమార్ లు పాల్గొని వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఈనెల 31న హైదరాబాదులో జరిగే టీజేఎఫ్ రజతోత్సవాలను విజయవంతం చేయాలి



**భానుపురి, మే 20 (సూర్య సేన) :** టీజేఎఫ్ 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా,ఈ నెల 31న హైదరాబాద్ జలవిహార్ లో నిర్వహించే ఉత్సవాలకు యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని టీయూజేఎఫ్ హెచ్ - 143 జిల్లా అధ్యక్షుడు వజ్జే వీరయ్య, టీజేఎఫ్ వ్యవస్థాపక డివిజన్ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం గోడ పత్రికను యూనియన్ నాయకులతో కలసి విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన పాత్ర అత్యంత కీలకమైనదని, చారిత్రాత్మకమైనదని ఉద్యమ తొలి రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జర్నలిస్టులు చేసిన సాహసం మరువలేనిదన్నారు. ఈ ఇరవై ఏళ్ల ప్రయాణంలో టీజేఎఫ్ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలు, పార్టీలను, నాయకులను, సంస్థలను, సంఘాలను సమన్వయం చేసింది అని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ప్రభుత్వాలు సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు ఇవ్వనప్పుడు జర్నలిస్టులే ముందుండి సమావేశాలు, సభలను నడిపించారన్నారు. అల్లం నారాయణ, మారుతి సాగర్ నేతృత్వంలో జరిగే కార్యక్రమం ఈనెల 31 న హైదరాబాదులో జరిగే తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవాల కార్యక్రమానికి పెద్ద ఎత్తున సూర్యాపేట జిల్లా నుంచి జర్నలిస్టులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**- టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలి.**

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట కలెక్టరేట్, మే 20 (సూర్య సేన) :** కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వ్యవసాయ శాఖ అధికారులకు, పోలీస్ డిపార్ట్మెంట్ మరియు విత్తన డీలర్లకు నకిలీ విత్తన అమ్మకాలపై నివారణ చర్యల నిమిత్తం జిల్లా సీడ్ టాస్క్ ఫోర్స్ మీటింగ్ మంగళవారం సాయంత్రం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోవు వానాకాలం 2025 -26 సంవత్సరానికి గాను వ్యవసాయ శాఖ తరపున ముందస్తు ప్లానింగ్ లో భాగంగా సూర్యాపేట జిల్లాలోని విత్తన డీలర్లకు విత్తనాలు అందుబాటులో ఉంచవలసిందిగా కోరుతూ, నకిలీ విత్తనాలు అమ్మకుండా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో తీసుకొస్తూ గ్రామాలలో నకిలీ విత్తనాలు తీసుకో వచ్చినట్లు గమనించినట్లయితే వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 6281492368 కు సమాచారం అందించాలని అలాగే నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే పిడి యాక్ట్ కూడా పెట్టాలని టాస్క్ ఫోర్స్ టీం లకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ పథకాల పైన మండల వ్యవసాయ అధికారులకు మరియు విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులను ఫార్మర్ రిజిస్ట్రీ ప్రోగ్రాంలో అందర్నీ పాల్గొని అందరు కూడా ఈ ఫార్మర్ ఐడిని పొందవలసిందిగా ఆదేశించారు. ఈ ఐడి ద్వారా సెంట్రల్ గవర్నమెంట్ పథకాలకు అర్హులవుతారు కాబట్టి జిల్లాలోని అందరూ రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి వద్దకు వెళ్లి ఈ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేసుకోవాల్సిందిగా కలెక్టర్ కోరారు. సబ్సిడీపై జిలుగు విత్తనాలు సూర్యాపేట జిల్లాకు 1500 కింటాలు 50% సబ్సిడీపై సరఫరాకు సిద్ధంగా ఉన్నవని ఇట్టి విత్తనాలను మండల వ్యవసాయ అధికారి సూచించినటువంటి సేల్ పాయింట్స్ వద్ద తీసుకోవలసినదిగా రైతలకు కలెక్టర్ కోరారు . వానకాలం సీజన్ కు సరిపడా విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచవలసిందిగా కలెక్టర్ వ్యవసాయ శాఖను ఆదేశించారు . హార్టికల్చర్ డిపార్ట్మెంట్ , అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కోసము రైతులను ఎంపిక చేయవలసిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి , జిల్లా ఉద్యాన అధికారి నాగయ్య , కోదాడ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి , మండల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులు, సూర్యాపేట జిల్లా విత్తన డీలర్లు , ఆర్టికల్చర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమతులు లేని హాస్పిటల్స్ లో మరణానికి కారకులెవరు?

**- డాక్టర్లా లేక జిల్లా వైద్యశాఖ అధికారులా...!**

**- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి**



**సూర్యాపేట టౌన్, మే 20 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో అనుమతి లేని హాస్పిటల్స్ లో వైద్యం వికటించి జరిగిన మరణాలకు కారకులెవరని, దీనికి బాధ్యత వైద్యం చేసిన డాక్టర్లదా లేక నిబంధనలను తుంగలో తొక్కి అనుమతులిచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులదా అని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి ప్రశ్నించారు. ఈ రోజు ఎం వి ఎన్ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో నకిలీ డాక్టర్లు కొంత మంది తప్పుడు ధృవీకరణ పత్రాలతో అనుమతులు పొంది ప్రజలకు వైద్యం చేసి అనేక మంది ప్రాణాలు బలిగొన్నారని అన్నారు.తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల విచారణ ద్వారా బయటపడిన నకిలీ డాక్టర్లు, అనుమతులు లేని స్కానింగ్ సెంటర్ల మూలంగా అనేక మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా,తప్పుడు రిపోర్ట్ల మూలంగా ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వైద్యం కోసం హాస్పిటల్ కు వెళ్లి వైద్యం వికటించి మరణిస్తే తప్ప తప్పుడు హాస్పిటల్లను సీజ్ చేయరా అని ప్రశ్నించారు. అనుమతులు లేవని నోటీసులు జారీ చేసిన శ్రీ కృష్ణ హాస్పిటల్, సాయి గణేష్ హాస్పిటల్ లలో అనేకమంది వైద్యానికి వెళ్లిన ప్రజల నుండి ఫీజులు ముక్కు పిండి వసూలు చేసి ప్రజలను నిలువు దోపిడి చేశారని అన్నారు. ఇంకా పట్టణంలో అనేక స్కానింగ్ సెంటర్లు, డయాగ్నొస్టిక్ కేంద్రాలలో, కొన్ని ప్రైవేట్ హాస్పిటల్లలో ఫీజుల దోపిడి తీవ్రంగా ఉందన్నారు. వీటన్నింటికి కారణం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లాలూచీ పడి అనుమతులివ్వడమే కారణమన్నారు. ఇప్పటికైనా సూర్యాపేట పట్టణంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సరైన అనుమతులు లేని హాస్పిటల్స్ లో వైద్యం తీసుకొని జరిగిన మరణాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు.

# ధనమూర్తి అకాల మృతి పార్టీకి తీరని లోటు

**- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపిన సిపిఐ**



**హుజూర్ నగర్ ప్రతినిధి, మే 20 (సూర్య సేన) :** తాటి చెట్టు పై నుండి పడి అకాల మృతి చెందిన నర్సింగ్ ధన మూర్తి గౌడ్ మృతదేహంపై మంగళవారం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధనమూర్తి మృతి తీరని లోటని తెలిపి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సోమగాని కృష్ణ,దొంత గాని సత్యనారాయణ, చేన్నగాని సైదులు, పొనుగుపాటి వాసుదేవరావు,పుట్టా నరసింహ, యల్లావుల రమేష్, బత్తిని మల్లయ్య, దొంతగాని వెంకటేశ్వర్లు, పుట్ట లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట డీఎస్పీగా ప్రసన్నకుమార్



**సూర్యాపేట, మే 20 (సూర్య సేన) :** సూర్యాపేట డీఎస్పీగా ప్రసన్న కుమార్ కుమార్ నియామకమయ్యారు. ఇటీవల సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి ఏసీబీ అధికారులకు చిక్కడంతో ఖాళీ ఏర్పడింది. మంగళవారం డీఎస్పీగా ప్రసన్న కుమార్ నియామకపు ఉత్తర్వులు పొందారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# నేడు టౌన్ - 1, విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సూర్యాపేట టౌన్, మే 20 (సూర్య సేన) :** సూర్యాపేట 1వ పట్టణంలో 33/11%ెజ% జమ్మిగడ్డ సబ్ స్టేషన్ లో మరమ్మత్తు కారణముగా ఉదయం 06:30 నుండి 08:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగు ప్రాంతాలు: ఈనాడు ఆఫీస్,గిరినగర్, జమ్మిగడ్డ, బాలాజీ నగర్, పీఎస్ఆర్ సెంటర్, కొత్తగూడెం బజార్,రాజీవ్ నగర్,తులసమ్మ హెూటల్, పూల సెంటర్, అలంకార్ టాకీస్ రోడ్డు, 60 ఫీట్ రోడ్,హుబట్ నగర్ , చర్చి కాంపౌండ్, జాకీర్ హుస్సేన్ నగర్,తిరుమల నగర్,భగత్ సింగ్ నగర్,అంబేద్కర్ నగర్, చింతలచెరువు, అమ్మ గార్డెన్ దగ్గర,శ్రీరామ్ నగర్ బాలాజీ నగర్ కుడా కుడా రోడ్డు, ఖమ్మం రోడ్డు, విద్యానగర్, భూమి రెడ్డి హాస్పిటల్ దగ్గర,రాజధాని టీ స్టాల్ దగ్గర,వెల్కమ్ టీ స్టాల్ దగ్గర అంతరాయం కలుగును కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని టౌన్ వన్ విద్యుత్ ఏఈ ఆర్ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


# ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**- మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక అరుణ్ కుమార్ దేశ్ ముఖ్**

**హుజూర్నగర్ ప్రతినిధి, మే 20 (సూర్య సేన) :** హుజూర్ నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక అరుణ్ కుమార్ దేశ్ ముఖ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎల్లమ్మ తల్లి దేవత పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జునరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ ముఖ్య నాయకులు గల్లా వెంకటేశ్వర్లు దొంగర వెంకటేశ్వర్లు, మంజు నాయక్ గొట్టే రామయ్య, మధిర ప్రతాపరెడ్డి గుజ్జుల వెంకటరెడ్డి నర్సింగ్ వెంకటేశ్వర్లు మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఖాదర్ సాబ్, మజీద్,పున్నయ్య మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ తహసీల్దార్‌గా వీరాభాయి బాధ్యతలు స్వీకరణ



**చౌటుప్పల్ ప్రతినిధి, మే 20 (సూర్య సేన) :** చౌటుప్పల్ మండల తహసీల్దార్‌గా వీరా భాయి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చే నెంబర్ అంబర్ పేట్ నుండి వారు బదిలీపై చౌటుప్పల్ కు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన హరికృష్ణ గుండాల మండలాని కి బదిలీఅయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దార్ కు పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్ధార్థ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు బాణాల రామ్ రెడ్డి , సుధాకర్,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో పర్యాటక అభివృద్ధి కొరకు చేస్తున్న కృషి అభినందనీయం

**- సిటీ ఆఫ్ ఫార్మింగ్ టన్ హిల్స్ మేయర్ థెరీసా రిచ్**



**మిచిగాన్, మే 20 (సూర్య సేన) :** యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని మిచిగాన్ రాష్ట్రంలోని సిటీ ఆఫ్ ఫార్మింగ్ టన్ హిల్స్ మేయర్ కార్యాలయంలో థెరీసా రిచ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం హారిసన్ హై స్కూల్ ను సందర్శించిన తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా సంస్కృతి, అవకాశాలు, పర్యాటక అభివృద్ధి కొరకు మీరు చేస్తున్న కృషి అభినందనీయని మేయర్ రిచ్ ప్రశంసించారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మరియు ఫార్మింగ్ టన్ హిల్స్ సమన్వయంతో తెలంగాణ రాష్ట్ర పర్యాటక రంగంలో మరింత పురోగతికి కృషి చేయడానికి అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సోదరుడు ఎన్నారై పటేల్ శ్రీధర్ రెడ్డి మరియు సత్య తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక ప్రాతిపదికన బోధించేందుకు ఆహ్వానం

**సూర్యాపేట రూరల్, మే 20 (సూర్య సేన) :** 2025 - 2026 విద్యా సంవత్సరానికి గాను సూర్యాపేట జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డి సి ఓ సిహెచ్ పద్మ మంగళవారం తెలిపారు. ఈనెల 23 లోగా సూర్యాపేట (ఇమాంపేట ) లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు 9704550271, 8008995137 నెంబర్లను సంప్రదించగలరు.

# బీటెక్ ఫీజును మించి ఎల్ కేజీ ఫీజు






హైదరాబాద్, మే 20 (సూర్య సేన) : కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల లో స్కూల్ ఫీజులు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఇంజినీరింగ్ ఫీజుల కంటే కూడా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ఫీజులు భారీగా ఉంటున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రైవేట్ కాలేజీల్లో ఇంజినీరింగ్ ఏడాది ఫీజులు రూ.40వేలు నుంచి రూ.లక్ష వరకు ఉన్నాయి. అదే స్కూల్ ఫీజుల విషయానికొస్తే ఏడాదికి లక్ష నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూళ్లో ఎల్‌కేజీ ఫీజుకు డొనేషన్ రూ.లక్ష, ఫీజు రూ.1.6లక్షలు ఉంది. మాదాపూర్, కొండా పూర్‌లోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ చెప్పే స్కూళ్లలోనైతే ఎల్‌కేజీ ఫీజు రూ.4లక్షల వరకుంటే, ఒకటో తరగతి ఫీజు దాదాపు రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు వసూలు చేస్తున్నారు. హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూళ్లో ఎల్‌కేజీకి రూ.60వేల వరకు డొనేషన్, రూ.1.5లక్షలు ఫీజును విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అయితే ఇందులో రకరకాల పేర్లతో ఈ ఫీజులను వసూలు చేస్తున్నారు. అడ్మిషన్ ఫీజులని, స్పెషల్ ఫీజు, స్పోర్ట్స్ ఫీజు, డొనేషన్, కంప్యూటర్ ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు, ల్యాబ్ ఫీజులని వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొన్ని స్కూళ్లు మాత్రం వీటికి అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం.. అడ్మిషన్ తీసుకునేటప్పుడు డొనేషన్ల లాంటి పేర్లతో ఎలాంటి ఫీజులను వసూలు చేయవద్దు. కానీ, కార్పొరేట్ పాఠశాలలు వీటిని పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఫీజులను ప్రతి ఏటా 20శాతం నుంచి 50శాతం వరకు పెంచేస్తున్నాయి. బడ్జెట్ స్కూళ్లు (చిన్నవి), ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు వేలు, లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఐఐటీ ఒలంపియాడ్, టెక్నో, కాన్సెప్ట్‌లాంటి పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను స్కూళ్లు ఆకర్షిస్తున్నాయి. వాస్తవానికి నిబంధనల ప్రకారం స్కూళ్లకు ఈ తరహా పేర్లు ఉండకూడదు. కానీ, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇవి యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 12వేల వరకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లున్నాయి. ఇందులో 40లక్షల వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఫీజులపై నియంత్రణ ఉండాలని గత కొన్నేళ్లుగా విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ అసోసియేషన్ సంఘాలు పోరాటాలు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. అయితే ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణ కోసం 2017లో కేసీఆర్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో ఒక కమిటీ వేసింది. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టును ప్రభుత్వం పక్కనపెట్టింది. ఇప్పటికీ ఫీజుల నియంత్రణపై సర్కారు నిర్ణయం తీసుకోలేదు. అయితే ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఫీజుల నియంత్రణపై దృష్టిసారించి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించింది. పలు సంఘాల ప్రతినిధులు తమ వాదనలు వినిపించారు. ఏటా 15శాతం ఫీజులు పెంచుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఫీజుల పెంపు 15శాతం మించితేనే ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఆధీనంలోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ సిఫారసులు అమలుచేయాలని కోరారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై దృష్టిపెట్టాలని, చిన్న చిన్న స్కూళ్లను ఇబ్బందులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే మరోసారి దీనిపై ప్రభుత్వం సమావేశమై ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు చెబుతున్నాయి.

# వివాదాల్లో ఎంపీ రఘునందనరావు....




మెదక్, మే 20 (సూర్య సేన) : ఇన్నాళ్లపాటు తన వాగ్ధాటితో.. ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టే భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ఒక్కసారిగా ఇబ్బందుల్లో పడ్డారు. ఓ భూ వివాదాన్ని గులాబీ సోషల్ మీడియా తెరపైకి తీసుకువచ్చింది. వివాదాన్ని గులాబీ పార్టీకి అనుకూలంగా పనిచేసే సోషల్ మీడియా సంస్థ రఘునందన్ రావు ప్రమేయం ఉందన్నట్టుగా భూముల వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చింది. భారత రాష్ట్ర సమితికి అనుకూలంగా పనిచేసే ఆ సోషల్ మీడియా ఎక్స్ ఫోజ్ చేసిన వివరాల ప్రకారం.. 84 ఎకరాల భూమిని రఘునందన్ రావు అక్రమంగా కొట్టేసారట. ఆ భూములు మొత్తం కూడా అసైన్డ్ వట. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రఘునందన్ రావు అక్రమంగా ఈ భూములను తన పేరు, మన కుటుంబ సభ్యుల పేరు మీద చేయించుకున్నారట. దుబ్బాక నియోజకవర్గం లోని అక్బర్ పేట్ ? భూమ్ పల్లి మండలం చౌదర్ పల్లి గ్రామంలోని వడ్డెర, దళిత కుటుంబాలకు సంబంధించిన 84 ఎకరాల లావుణి భూమి ఉన్నది. ఇది అసైన్ రకానికి చెందినది. అయితే ఈ భూములను రఘునందన్ రావు కొనుగోలు చేసినట్టు భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. ఆ ఆరోపణలకు తగ్గట్టుగానే.. ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం కూడా తెరపైకి కీలకమైన ఆధారాలను తీసుకొచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూమిని రఘునందన్ రావు క్లియర్ పట్టా చేయించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూభారతిలో అసైన్డ్ భూములు పట్టాగా మార్చుకునే అవకాశం ఉందని.. అందువల్లే రఘునందన్ రావుకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నారని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. 84 ఎకరాల చుట్టూ రఘునందన్ రావు కంచె వేశారట. అక్కడికి ఎవరూ వెళ్లకుండా బౌన్సర్లతో సెక్యూరిటీ ఏర్పాటు చేశారట.. దీనిపై వట్టెం రామకృష్ణ అనే న్యాయవాది కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో ఈ భూముల బాగోతం బయటికి వచ్చిందని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది? ఈ వ్యవహారం బయట పెడితే మీడియా సంస్థలకు నోటీసులు పంపిస్తున్నారని.. కేసులు వేసి బెదిరిస్తామని రఘునందన్ రావు భయపెడుతున్నారని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. ఇక ఇటీవల కేటీఆర్ కూడా పేరు ప్రస్తావించకుండా రఘునందన్ రావు పై ఆరోపణలు చేశారు. భూములు తన పేరు, కుటుంబ సభ్యుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆయన ఆరోపించిన తర్వాత ఇంతవరకు ఆ పార్టీ ఒక్క ఆధారం కూడా బయట పెట్టలేదు. కానీ అనూహ్యంగా రామకృష్ణ అనే న్యాయవాది ఈ వివరాలను బయట పెట్టడంతో.. ఇదేదో తమకృషి వల్లే అన్నట్టుగా భారత రాష్ట్ర సమితి అనుకూల సోషల్ మీడియా విభాగం తెగ ప్రచారం చేసుకుంటున్నది. అంతేకాదు ఆ భూములపై డ్రోన్ ద్వారా తీసిన వీడియోలను సోషల్ మీడియాలో తెగ పోస్ట్ చేస్తున్నది. అయితే 84 ఎకరాల భూమిని రఘునందన్ రావు, ఆయన భార్య మంజుల, కూతురు సింధు పేరు మీద చేయించారని భారత రాష్ట్ర సమితి అనుకూల సోషల్ మీడియా విభాగం ఆరోపిస్తోంది. త్వరలోనే మరిన్ని వివరాలు బయటపెడతామని చెబుతోంది. అయితే రాజకీయ దుగ్ద తో నేరుగా రఘునందన్ రావు పై ఆరోపణలు చేస్తోంది. అంతేకాదు రఘునందన్ రావు వివరణ లేకుండానే ఏకపక్షంగా ఆరోపణలు చేస్తుంది. అయితే రఘునందన్ రావు మాత్రం లీగల్ నోటీసులు పంపిస్తూ.. సదరు సంస్థలపై పరువు నష్టం దావా వేస్తున్నట్టు చెబుతున్నారు.. చూడాలి మరి ఈ భూముల వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో? అన్నట్టు ఈ భూములను తమ ఇష్టానుసారంగా అమ్మినట్టు అక్కడి రైతులు చెబుతున్నారు. అలాంటప్పుడు ఇందులో వివాదం ఏముందో అర్థం కావడం లేదని బిజెపి నాయకులు అంటున్నారు.

# ఇంజనీరింగ్ సీట్ల అమ్మకాలు షురూ

హైదరాబాద్, మే 20 (సూర్య సేన) : రాష్ట్రంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో మేనేజ్ మెంట్ కోటా సీట్లను ఆన్ లైన్లో భర్తీ చేయాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ప్రైవేటు కాలేజీల్లో మేనేజ్ మెంట్ కోటా సీట్ల అమ్మకాలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. ఎప్ సెట్ ర్యాంకు, విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా స్టూడెంట్ల నుంచి కాలేజీల మేనేజ్ మెంట్లు డబ్బులు వసూలు చేస్తున్నాయి. ముందస్తు సీట్ల రిజర్వు పేరుతో 30 నుంచి 50 శాతం ఫీజును పేరెంట్స్ నుంచి తీసుకుంటున్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మొత్తం ఫీజు వసూలు చేసేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఒకవేళ ప్రభుత్వమే ఎప్ సెట్ బీ? కేటగిరి సీట్లను ఆన్లైన్ లో నింపితే.. పేరెంట్స్ కట్టిన డబ్బులు రిటర్న్ ఇచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీంతో పేరెంట్స్ లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం బీ కేటగిరి సీట్ల భర్తీపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కొన్నేండ్లుగా నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వాళ్లకే మేనేజ్ మెంట్ సీట్లను కాలేజీలు అమ్ముకుంటున్నాయి. ఈ దందాకు చెక్ పెట్టేందుకు హయ్యర్ ఎడ్యుకేషన్ అధికారులు రెడీగా ఉన్నా.. సర్కారు పర్మిషన్ లేకపోవడంతో వెనక్కి తగ్గారు. త్వరలోనే బీటెక్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో.. దీనిపై ప్రభుత్వం త్వరగా స్పష్టత ఇవ్వాలని పేరెంట్స్ కోరుతున్నారు. రాష్ట్రంలో 157 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా, వాటిలో లక్ష వరకూ సీట్లు ఉన్నాయి. దీంట్లో 70 శాతం సీట్లను ఈఏపీ సెట్ ర్యాంకుల ద్వారా భర్తీ చేస్తుండగా, మిగిలిన 30 శాతం సీట్లను మేనేజ్ మెంట్ కోటా కింద నింపుతారు. ఈ కోటాలోనే నాన్ రెసిడెంట్ ఇండియన్ (ఎన్ఆర్ఐ) కోటా ద్వారా అడ్మిషన్లు కల్పిస్తారు. అయితే, ఎప్ సెట్ ద్వారా నింపే సీట్లన్నీ ప్రభుత్వమే నిబంధనల ప్రకారం.. విద్యార్థులకు వచ్చిన ర్యాంకుల ఆధారంగా రిజర్వేషన్లకు అనుగుణంగా నింపుతున్నారు. కానీ, మేనేజ్ మెంట్ కోటా (బీ కేటగిరి) సీట్లను మాత్రం మేనేజ్ మెంట్లు భర్తీ చేసుకునేలా ప్రభుత్వం అనుమతులు ఇస్తోంది. ఇది మేనేజ్ మెంట్లకు వరంగా మారింది. బీ? కేటగిరి సీట్లను ఎప్ సెట్ ర్యాంకు, జేఈఈ ర్యాంకు, ఇంటర్ మార్కుల ఆధారంగా భర్తీ చేయాలనే నిబంధనలు ఉన్నా దాదాపు ఏ కాలేజీ కూడా ఈ విధానాన్ని అమలు చేయడం లేదు. మేనేజ్ మెంట్ కోటా సీట్లకు కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ బ్రాంచులకు రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ దందాకు చెక్ పెట్టాలని కొన్నేండ్లుగా పేరెంట్స్ విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీన్ని పక్కన పెట్టగా.. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై పేరెంట్స్, స్టూడెంట్లు ఆశలు పెట్టుకున్నారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో మేనేజ్ మెంట్ కోటా, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీని ప్రభుత్వమే చేపట్టాలని పేరెంట్స్, స్టూడెంట్ యూనియన్ల నుంచి భారీగా డిమాండ్లు, వినతులు వస్తున్నాయి. ఈ డిమాండ్లకు అనుగుణంగా గతేడాది హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అధికారులు.. బీ కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సర్కారుకు లేఖ రాశారు. ఎంబీబీఎస్ తరహాలో బీటెక్ సీట్లనూ ఆన్లైన్లో భర్తీ చేస్తామని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, అప్పట్లో దానిని ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ఏడాది బీటెక్ లో కొత్త ఫీజులు అమలు కాబోతున్నాయి. ఇప్పటికే ఎప్ సెట్ ఫలితాలు విడుదలైనా, ఇంకా అడ్మిషన్ల నోటిఫికేషన్ రాలేదు. ఈ టైమ్లోనే బీ కేటగిరి సీట్ల భర్తీ విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పేరెంట్స్, స్టూడెంట్లు కోరుతున్నారు. ఆన్ లైన్లో మేనేజ్ మెంట్ సీట్లను నింపితే.. కాలేజీల అక్రమ దందాకు చెక్ పెట్టినట్లు అవుతుందని చెప్తున్నారు.

# సైబర్ వలలో మాజీ ఐఏఎస్

## - మూడున్నర కోట్లుమాయం

హైదరాబాద్, మే 20 (సూర్య సేన) : సైబర్ నేరాల, మోసగాళ్ల గురించి పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని చెప్పినా.. జనాల చెవికి ఎక్కడం లేదు. ఏదో విధంగా మాయగాళ్ల వలలో పడి.. భారీగా సమర్పించుకుంటున్నారు. మరి ఇలా మోసపోతున్న వారి జాబితాలో కేవలం నిరక్షరాస్యులు, సామాన్యులు మాత్రమే ఉన్నారా అనుకుంటే పొరపాటు. బాగా చదువుకుని పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వారిని సైతం ఏమారుస్తున్నారు కేటుగాళ్లు. తాజాగా ఇలాంటి సంఘటనే ఒకటి వెలుగులోకి వచ్చింది. మాజీ ఐఏఎస్ అధికారినే బురిడీ కొట్టించాడో సైబర్ నేరస్థుడు. సదరు అధికారి ఖాతా నుంచి ఏకంగా రూ.3.37 కోట్లు ఊడ్చేశాడు. స్టాక్‌మార్కెట్‌లో భారీలాభాలు ఆర్జించొచ్చంటూ సైబర్ నేరస్థుడు.. విశ్రాంత ఐఏఎస్‌ను మాయ చేశాడు. అంతేకాక విడతల వారీగా ఆయన బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులు డ్రా చేస్తూ.. మొత్తంగా రూ.3.37 కోట్లు ఊడ్చేశాడు. సదరు అధికారి.. ఉమ్మడి రాష్ట్రంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో పనిచేసిన విశ్రాంత ఐఏఎస్(72) కావడం గమనార్హం. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని సోమాజీగూడలో నివాసముంటున్నారు. కొన్ని నెలల క్రితం ఆయన సెల్‌ఫోన్‌కు ట్రేడింగ్ ప్లాట్‌ఫాం పేరిట ఒక లింక్ వచ్చింది. అయితే సదరు అధికారికి ట్రేడింగ్ మీద ఆసక్తి ఉండటంతో.. ఆ మెసేజ్‌కు స్పందించాడు. దీంతో సైబర్ నేరగాడు.. తాను కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ అర్జున్ మెహతాను అంటూ.. మాజీ ఐఏఎస్ అధికారితో పరిచయం పెంచుకున్నాడు. ఈక్రమంలో తాము రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానంతో మ్యూచువల్ ఫండ్స్, ఐపీవోల్లో పెట్టుబడులు పెడితే లిస్టింగ్ సమయంలోనే 120-160 శాతం వరకు లాభాలు పొందొచ్చని సైబర్ నేరగాడు.. అధికారికి ఆశ చూపాడునేరస్థుడి మాయమాటలు నమ్మిన మాజీ ఐఏఎస్ అధికారికి.. సైబర్ నేరస్థుడు రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో వాట్సప్ వీడియోకాల్ చేస్తూ షేర్‌మార్కెట్ వ్యవహారాలపై సలహాలు ఇస్తుండే వాడు. గ్లోబల్ ప్లాట్‌ఫాంపై పోటీపడుతున్న తనకు అనుకూలంగా ఓటు వేయాలని.. అలా చేస్తే తాను నంబర్‌వన్ స్థానానికి చేరుకుంటున్నానని తెలిపేవాడు. అంతేకాక సదరు అధికారిని నమ్మించడం కోసం.. తాను ఫస్ట్ ప్లేస్‌కి చేరుకున్నానంటూ.. అలా నెమ్మదిగా సైబర్ నేరస్థుడు సదరు మాజీ ఐఏఎస్ నమ్మకం సంపాదించాడుఆ తర్వాత తన ప్లాన్ అమలు చేశాడు. సదరు అధికారి తనను పూర్తిగా నమ్మాడని భావించిన తర్వాత.. మోసగాడు.. స్టాక్‌మార్కెట్ పెట్టుబడుల పేరిట తాను సూచించిన ఖాతాలకు పలుమార్లు నగదు బదిలీ చేయించుకున్నాడు. మార్చి 30 నుంచి మే నెల 13వ తేదీ వరకు.. విడతల వారీగా మొత్తం రూ.3.37 కోట్లను తన ఖాతాలో వేయించుకున్నాడు. ఈ మొత్తం పెట్టుబడికి రూ.22.35 కోట్ల లాభమొచ్చిందని విశ్రాంత ఐఏఎస్ వర్చువల్ ఖాతాలో చూపించాడుభారీ లాభాలు ఆర్జించానని భావించిన ఆ మాజీ ఐఏఎస్ అధికారి.. ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించాడు. కానీ సాధ్యం కాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన అధికారి.. పోలీసులు ఆశ్రయించి.. కేసు నమోదు చేశాడు.

# తీరనున్న 3 జిల్లాల ప్రజల ఆశలు

నిజామాబాద్, మే 20 (సూర్య సేన) : దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆర్మూర్ జగిత్యాల మంచిర్యాల ప్రజల చిరకాల వాంఛ నెరవేర ఉంది. జాతీయ రహదారి 63 నువ్వు అభివృద్ధి పరుస్తూ నాలుగు లైన్ల రహదారిగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ కృషి మేరకు పనులు ప్రారంభం కానున్నాయి. మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ఆర్మూరు, జగిత్యాల, మంచిర్యాల హైవే నిర్మాణానికి పర్యావరణ అనుమతులను మంజూరు చేసింది. చాలా కాలం నుంచి ఉన్న ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతుంది. దీనికి సంబంధించి త్వరలో టెండర్లు ఆహ్వానించి మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఎన్ హెచ్ 63 నీ నాలుగు లైన్లుగా విస్తరించి, పట్టణాలు మరియు గ్రామాల దగ్గర బైపాస్ నిర్మించబోతున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టు పూర్తి అవడానికి రూ.3,850 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కలలు కంటున్న కలలు త్వరలో నెరవేరబోతున్నాయి. ఏళ్ల తరబడి ఆర్మూరు, జగిత్యాల, మంచిర్యాల ప్రాంతానికి చెందిన ప్రజలు ఎదురుచూస్తున్న హైవేకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. తాజాగా ఈ రోడ్డు నిర్మాణానికి వీలుగా ఉండే విధంగా అటవీ మరియు పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. దాంతో త్వరలో టెండర్లు పిలిచి నిర్మాణ పనులను చేపడతారు. మరో మూడు ఏళ్లలో ఈ హైవే పూర్తవుతుందని తెలుస్తుంది. ఎన్ హెచ్ 63 ప్రస్తుతం రెండు వరుసలుగా ఉంది. ఈ దారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో దీనిని నాలుగు లైన్లుగా నిర్మించాలంటే చాలామంది ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. డబుల్ ట్రాక్ రోడ్లో చాలామంది ప్రమాదాలకు గురయ్యారు. నిత్యం ప్రజల రావణ సరుకు రావణా భారీ వాహనాలతో పాటు అనేక వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తాయి. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ మార్గాలని మరింత అభివృద్ధి చేయాలన్న అధికారుల కృషి ఫలించలేదు. కొన్ని కారణాల వలన అది కార్యరూపం దాల్చలేదు . తాజాగా ప్రధానమంత్రి కార్యాలయం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ పని ప్రారంభం కానుంది. గత ఎన్నికల్లో పర్యటన నిమిత్తం నిజామాబాద్కు వచ్చిన జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ ఇచ్చిన హామీ మేరకు జాతీయ రహదారి 63 అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. ఎన్ హెచ్ 63 రహదారి మహారాష్ట్రలో దౌండ్ దగ్గర మొదలయ్యి తెలంగాణ రాష్ట్రం, చతిస్గడ్ రాష్ట్రం మీదుగా 1065 కిలోమీటర్లు కొనసాగి ఒడిస్సా రాష్ట్రంలోని కోరాపూట్ లో ముగుస్తుంది. ఈ రహదారి తెలంగాణ రాష్ట్రంలో బోధన్, నిజామాబాద్, ఆర్మూరు, మెట్పల్లి, కోరుట్ల, జగిత్యాల, లక్సెట్టిపేట, ధర్మపురి, మంచిర్యాల, చెన్నూరు ప్రాంతాలమీదుగా ఈ రహదారి ఉంటుంది.

# పేపర్ బోర్డు పేరుతో రియల్ దందా

ఖమ్మం, మే 20 (సూర్య సేన) : పరిశ్రమల స్థాపనకు కారుచౌకగా ప్రభుత్వ భూములు పొంది నామమాత్రంగా పరిశ్రమలు స్థాపించినట్టు చేస్తూ ప్రభుత్వ భూము ల్లో అక్రమ వెంచర్లతో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం, రామాంజనేయ కాలనీ పరిసర ప్రాంతంలో యదేచ్ఛగా ప్రభుత్వ భూముల్లో అక్రమ వెంచర్లు గెలుస్తున్నాయి. సర్వే నెంబరు 137/1. 20 కుంటల ప్రభుత్వ భూమి కబ్జా చేసి ఈ భూమికి తప్పుడు సర్వే నెంబర్ 137/2/o చూపి ప్రైవేట్ పట్టా భూమి పేరుతో కాగితాలు సృష్టించారు. 2004 సంవత్సరంలో విజయవాడ కు చెందిన నాగ వెంకట శ్రీలక్ష్మి ఈ భూమిని కొనుగోలు చేసి, బండా రామిరెడ్డి వద్ద నుండి ఓ అట్టల ఫ్యాక్టరీ నిర్మాణం చేశారు. ఈ ఫ్యాక్టరీ కి ఎలాంటి అనుమతులు లేవని ఆరోపణలు ఉన్నాయి. మరో చోట ఉన్న శ్రీ పద్మాలయ పేపర్ బోరడ్స్ అనే ఫ్యాక్టరీ అనుమతులను చూపుతూ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులకు వేగనామం పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. పద్మాలయ పేపర్ బోరడ్స్ పాల్వంచ మండలం దంతాల బోర గ్రామానికి చెందిన ఒక గిరిజనుడిని బినామీగా నమోదు చేసినట్లు సమాచారం. ఇటీవల బినామీ గిరిజనుడికి, కర్మాగారం నిర్వహకులకు మనస్పర్ధలు వెలబడటంతో విషయం వెలుగు చూసింది. ఒకవైపు అనుమతులు లేకుండా అట్టాల ఫ్యాక్టరీ నడుపుతూ, మరోవైపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ వెంచర్లతో భూదందా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్న రెవెన్యూ, పంచాయతీ, పరిశ్రమల అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం తో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఈ స్థలంపై ఎల్ టి ఆర్ కేసులు నమోదైన ఎటు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ కల్పించుకొని చెంచుపల్లి మండలం ఇండస్ట్రియల్ పార్కు ఏరియాలో జరుగుతున్న భూధందా పై సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# ప్రకాశం పంతులుకు నివాళు లర్పించిన వైఎస్ జగన్

తాడేపల్లి, మే 20 (సూర్య సేన) : వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమం జరిగింది. , ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నేతలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శత్రుచర్ల పరీక్షిత్ రాజు, అలజంగి జోగారావు, తిప్పల నాగిరెడ్డి, మళ్ళ విజయ్ ప్రసాద్, వాసుపల్లి గణేష్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రక్తం రహదారి - ఘోర రోడ్డు ప్రమాదం

వికారాబాద్, మే 20 (సూర్య సేన) : వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ సమీపంలో నేషనల్ హైవే 163 పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని డిన్నర్ కు వెళ్లి వెళ్తున్న ఒక బస్సు, వెనుక నుంచి ఢీ కొట్టింది. బస్సులో సుమారు 60 మంది ఉన్నట్టు సమాచారం. నలుగురు బస్సులో ఇరుక్కుని మృతి చెందారు. స్థానికులు పోలీసులు మృతదేహాలను అతి కష్టంగా బయటకు తీసారు. పరిగి లో డిన్నర్ కు హాజరై తిరిగి తమ గ్రామానికి ట్రావెల్స్ బస్సులో వెళుతుండగా ఘటన జరిగింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన వెళ్లి గ్రామానికి చెందినవారుగా గుర్తించారు. క్షతగాత్రులను మృతదేహాలను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


# రోడ్డుపై వడ్లు పోసి రైతుల ధర్నా

మే 20 (సూర్య సేన) : మెదక్ శివంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ముందు తూప్రాన్ నర్సాపూర్ రహదారిపై మొలకెత్తిన వడ్లు రోడ్డుపై పోసి రైతులు ధర్నాకు దిగారు. నెల రోజులుగా వడ్లు కొనుగోలు చేయడం లేదంటూ ఆందోళన, ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలంటూ డిమాండ్ చేసారు. రైతు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సహకార సంఘం సీఈవో ను స్థానిక ఎమ్మెల్యే ఆదేశించారు.

# అప్పుల ఊబిలో జెన్‌కో.....

ముంబై, మే, 20 (సూర్యసేన ప్రతినిధి): రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ(జెన్‌కో) అప్పుల ఊబిలో కూరుకుపోయింది. బొగ్గు అందించే సంస్థలకు, సరఫరా చేసే కంపెనీలకు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉంది. తీసుకున్న అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని స్థితికి చేరుకుంది. జెన్‌కో నుంచి విద్యుత్‌ను వాడుకుంటున్న డిస్కంలు నిధులను మాత్రం సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో అప్పులతోనే సంస్థను నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ ప్రభావం విద్యుత్ ఉత్పత్తిపై పడుతోందని అధికారులు చెబుతున్నారు. సుమారు రూ.30 వేల కోట్ల వరకు జెన్‌కో అప్పుల్లో ఉంది. రాష్ట్రంలో మూడు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. విజయవాడలోని నార్లా తాతారావు థర్మల్ పవర్ ప్లాంట్(ఎన్‌టిటిపిఎస్), నెల్లూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంట్(ఎస్‌డిఎస్‌టిపిపి), కడపలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్(ఆర్‌టిపిపి) ఉన్నాయి. వీటికి తెలంగాణలోని సింగరేణి, ఒడిశాలోని మహానది బొగ్గు గనుల నుంచి బొగ్గు రావాలి. రైల్వే లైన్ల ద్వారా, షిప్‌ల ద్వారా గానీ బొగ్గు చేరుతోంది. ఈ సరఫరా చేసే కంపెనీలకు జెన్‌కో వేల కోట్లలో బకాయిలు ఉంది. ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్దమొత్తంలో బకాయిలు పెట్టలేదని అధికారులు చెబుతున్నారు. కోల్ కంపెనీలతో పాటు గనుల నుంచి సరఫరా చేసే కాంట్రాక్టర్లకు కూడా పెద్ద మొత్తంలో బకాయి పడింది.
దీంతో ప్లాంట్లకు చేరాల్సిన బొగ్గు ఆలస్యమవుతోంది. నెల్లూరులోని కృష్ణపట్నం పోర్ట్ నుంచి ఆర్‌టిపిపికి సరఫరా చేసే ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు సుమారు రూ.200కోట్ల వరకు జెన్‌కో బకాయి పడి ఉంది. ఈ బకాయి పేరుకుపోవడంతో ఆ కాంట్రాక్టర్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఆర్‌టిపిపికి సరఫరా తగ్గడంతో ప్లాంట్‌లో బొగ్గు నిల్వలు అడుగంటిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లలో కనీసం 15 రోజులకు సరిపడా బొగ్గు నిబంధనల ప్రకారం ఉండాలి. ఎన్‌టిటిపిఎస్‌లో 10 రోజులకు, ఎస్‌డిఎస్‌టిపిఎస్‌లో 6 రోజులకు సరిపడ బొగ్గు ఉంది. ఆర్‌టిపిపిలో ఒక్క రోజుకు కూడా సరిపోయే బొగ్గు లేకపోవడం గమనార్హం. ఈ ప్లాంట్‌లో మొత్తం ఆరు యూనిట్లు ఉన్నాయి. 210 యూనిట్లు 5తో పాటు 600 యూనిట్ ఒకటి ఉంది. ఒక రోజుకు 28,500 మెట్రిక్ టన్నుల బొగ్గు ఇక్కడ అవసరం. కానీ అక్కడ కేవలం 17,109 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. గనుల నుంచి వచ్చిన బొగ్గును కోల్ స్టోరేజ్‌లో ఉంచి ప్లాంట్లలో వాడతారు. కానీ బొగ్గు లేకపోవడంతో వచ్చింది వచ్చినట్లే నేరుగా ఉపయోగిస్తున్నారు. ప్లాంట్ అధికారులు మాత్రం రైల్వే ర్యాకులు వస్తున్నాయని, బొగ్గు పరిస్థితి మెరుగుపడుతుందని చెబుతున్నారు. కొరత వల్ల ప్లాంట్‌లో ఉత్పత్తి కూడా తగ్గింది. ప్లాంట్ సామర్థ్యం 1650 మెగావాట్లు కాగా శనివారం 900 మెగావాట్ల ఉత్పత్తే వచ్చినట్లు సమాచారం.

## యూకే కుబేరుల జాబితాలో హిందుజా హవా..



ముంబై, మే, 20 (సూర్యసేన ప్రతినిధి): పారిశ్రామికవేత్త గోపీచంద్ హిందుజా నేతృత్వంలోని హిందుజా కుటుంబం మరోసారి సత్తా చాటింది. తాజాగా విడుదలైన 'సండే టైమ్స్ రిచ్ లిస్ట్ 2025'లో ఈ కుటుంబం అగ్రస్థానంలో నిలిచింది. దీంతో బ్రిటన్ అత్యంత ధనవంతుల జాబితాలో హిందుజా గ్రూప్ వరుసగా నాలుగో ఏడాది తమ స్థానాన్ని నిలబెట్టుకుంది. వీరి సంపద విలువ 35.3 బిలియన్ పౌండ్లుగా ఉంది. 110 ఏళ్ల చరిత్ర కలిగిన హిందుజా గ్రూప్ ఆర్థికం, రవాణా, వైద్య రంగాల్లో 38 దేశాలకు విస్తరించి, తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది. అదే సమయంలో దాతృత్వ కార్యక్రమాల్లోనూ తమ ఉనికిని చాటుతోంది. 110 ఏళ్ల క్రితం ప్రారంభమైన హిందుజా గ్రూప్ ప్రస్తుతం 38 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా రవాణా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, డిజిటల్ టెక్నాలజీ, మీడియా, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, లూబ్రికెంట్స్, స్పెషాలిటీ కెమికల్స్, ఎనర్జీ, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ వైద్య రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టింది. 'సండే టైమ్స్' ప్రచురించే ఈ ప్రతిష్ఠాత్మక జాబితా బ్రిటన్‌లో నివసిస్తున్న 350 అత్యంత ధనవంతులు వారి కుటుంబాల ఆస్తులను లెక్కిస్తుంది. భూమి, ఆస్తులు, ప్రభుత్వ రంగ కంపెనీల షేర్లు, ఇతరత్రా లెక్కించదగిన సంపద ఆధారంగా ఈ ర్యాంకింగ్‌ను నిర్ణయిస్తారు. "హిందుజా కుటుంబం బ్రిటన్ కుబేరుల జాబితాలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. వారి వ్యాపార సామ్రాజ్యం పరిమాణంలోనే కాకుండా, పరిధిలోనూ విస్తరిస్తోంది" అని 'టైమ్స్' పేర్కొంది. గత ఏడాది కాలంలో హిందుజా గ్రూప్ భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల రంగంపై మరింత దృష్టి సారించింది. దేశంలో స్థిరమైన రవాణాకు ప్రోత్సాహం లభిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి గణనీయమైన నిధులను కేటాయించింది. 110 ఏళ్ల చరిత్ర కలిగిన హిందుజా గ్రూప్ ఆర్థికం, రవాణా, వైద్య రంగాల్లో 38 దేశాలకు విస్తరించి, తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది. అదే సమయంలో దాతృత్వ కార్యక్రమాల్లోనూ తమ ఉనికిని చాటుతోంది. 110 ఏళ్ల క్రితం ప్రారంభమైన హిందుజా గ్రూప్ ప్రస్తుతం 38 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా రవాణా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, డిజిటల్ టెక్నాలజీ, మీడియా, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, లూబ్రికెంట్స్, స్పెషాలిటీ కెమికల్స్, ఎనర్జీ, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ వైద్య రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టింది. 'సండే టైమ్స్' ప్రచురించే ఈ ప్రతిష్ఠాత్మక జాబితా బ్రిటన్‌లో నివసిస్తున్న 350 అత్యంత ధనవంతులు వారి కుటుంబాల ఆస్తులను లెక్కిస్తుంది. ఇది ఆటోమొబైల్ రంగంలో వారి సంస్థ తీసుకుంటున్న 'గ్రీన్' మార్పును సూచిస్తోంది. "మా ఆవిష్కరణల ఆధారిత వృద్ధి లక్ష్యానికి అనుగుణంగా, భవిష్యత్తు రవాణా స్థిరమైన సాంకేతికతల్లో పెట్టుబడులు పెడుతున్నాం" అని లండన్‌లో జరిగిన ఒక పరిశ్రమ సదస్సులో గ్రూప్ ప్రతినిధి తెలిపారు. అంతేకాకుండా, అశోక్ లేలాండ్ ఛైర్మన్ ధీరజ్ హిందుజా 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ, 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో హిందుజా లేలాండ్ ఫైనాన్స్‌ను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.
ఇది వారి దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహాన్ని తెలియజేస్తోంది. హిందుజా ఫౌండేషన్ విద్య, వైద్యం, నీటి సంరక్షణ స్థిరమైన గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, వారి దాతృత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సంస్థ యూకే భారతదేశంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతోంది. అందరినీ కలుపుకొని అభివృద్ధి సాధించాలనే వారి సిద్ధాంతాన్ని ఈ దాతృత్వ కార్యక్రమాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ సూత్రాన్ని గ్రూప్ వ్యవస్థాపకులు పరమానంద్ దీప్‌చంద్ హిందుజా నెలకొల్పారని చెబుతారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు..



ముంబై, మే, 20 (సూర్యసేన ప్రతినిధి): గత కొన్ని రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు ఈ రోజు స్వల్పంగా తగ్గింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడంతో బంగారం ధరలు తగ్గాయి. బంగారం, వెండి ధరల్లో ప్రతి రోజు హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటాయి. ఇటీవల లక్ష రూపాయలు దాటిన గోల్డ్ ధర.. ప్రస్తుతం దిగి వచ్చింది. మీరు బంగారం కొనాలని చూస్తే మే 19వ తేదీన బంగారం ధరల గురించి తెలుసుకోండి. సోమవారం బంగారం, వెండి ధరల్లో పెద్దగా మార్పు లేదు. స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. తాజాగా దేశీయంగా 22 క్యారెట్ల తులం గోల్డ్ ధర 87,190 రూపాయలు ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర 95,120 రూపాయల వద్ద కొనసాగుతుంది. అలాగే వెండి ధర విషయానికొస్తే 96,900 రూపాయల వద్ద కొనసాగుతోంది. ఇక హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ87,190 ఉండగా, 24 క్యారెట్ల తులం ధర రూ.95,120 వద్ద ఉంది. ఇక ఢిల్లీ ధర విషయానికొస్తే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.87,340 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.95,270 ఉంది. ఇక ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 87,190 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.95,120 ఉంది. గత కొన్ని రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు ఈ రోజు స్వల్పంగా తగ్గింది.
అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడంతో బంగారం ధరలు తగ్గాయి. ప్రజలు బంగారంలో పెట్టుబడి పెట్టడానికి బదులుగా స్టాక్ మార్కెట్ వంటి ఎంపికలను ఇష్టపడతారు ఎందుకంటే వాతావరణం బాగున్నప్పుడు, ప్రజలు రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉంటారు. దీనితో పాటు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో శాంతి నెలకొంటుందనే ఆశ, భారతదేశం-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత ముగిసిన వార్త కూడా బంగారం డిమాండ్‌ను ప్రభావితం చేశాయి. అంతేకాకుండా, డాలర్ ధర పెరుగుదల, స్టాక్ మార్కెట్ పెరుగుదల కూడా బంగారం మెరుపును తగ్గించాయి. అయితే, కొన్ని రోజుల క్షీణత తర్వాత, ఆ ధోరణి మళ్ళీ పెరుగుతోంది.

## 3,300కుపైగా కంపెనీల పేర్లు తొలగింపు!




ముంబై, మే, 20 (సూర్యసేన ప్రతినిధి): కంపెనీల చట్టం కింద నమోదైన కంపెనీల సంఖ్య తగ్గనుంది. ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేనందున తమ పేర్లు తొలగించాలని 3,300కు పైగా కంపెనీలు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేశాయి. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని వివిధ రాష్ట్రాల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ) పత్రికల్లో నోటిఫికేషన్లు జారీ చేశాయి. కంపెనీల చట్టంలోని సెక్షన్ 248 (2) ప్రకారం ఏదైనా కంపెనీ నమోదైన ఏడాదిలోగా వ్యాపారం ప్రారంభించక పోయినా లేదా ఒక ఆర్థిక సంవత్సరం తర్వాత వరుసగా రెండేళ్ల పాటు ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు చేయకపోయినా ఆ కంపెనీ తమ పేరును రికార్డుల నుంచి తొలగించమని కోరవచ్చు. అయితే అందుకు వాటాదారుల్లో 75 శాతం మంది ఆమోదం కావాలి. మహారాష్ట్ర నుంచే ఎక్కువ: తమ పేర్లను రికార్డుల నుంచి తొలగించమని మహారాష్ట్ర నుంచే ఎక్కువ కంపెనీలు కోరాయి. ఆ రాష్ట్రం నుంచి దీనికి సంబంధించి 700కు పైగా కంపెనీల నుంచి విజ్ఞప్తులు అందాయి. ఢిల్లీ (500o) కర్ణాటక (350o) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుంచి కూడా రెండేసి వందల కంపెనీలు ఇందుకోసం విజ్ఞప్తి చేశాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశంలో 28,52,449 కంపెనీలు నమోదై ఉండగా అందులో 18,50,932 కంపెనీలు మాత్రమే చురుగ్గా పని చేస్తున్నాయి.

## 14 బిలియన్ డాలర్ల ఫోన్‌ల దిగుమతికి ఆపిల్ కీలక ప్రణాళిక...!




ముంబై, మే, 20 (సూర్యసేన ప్రతినిధి): జూన్ త్రైమాసికంలో ఆపిల్ తన ఐఫోన్లలో ఎక్కువ భాగాన్ని భారతీయ ఫ్యాక్టరీల నుండి అమెరికా మార్కెట్‌కు దిగుమతి చేసుకోవాలనే లక్ష్యంగా పెట్టుకున్నందున, భారతదేశంలోని ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలు $12, $14 బిలియన్ల మధ్య విలువైన డిమాండ్‌ను తీర్చడానికి బాగా సన్నద్ధమయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు. భారతదేశంలో ఐఫోన్ ఉత్పత్తి విలువ పరంగా ఆపిల్ 2026 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి $40 బిలియన్లకు చేరుకుంటుంది. దీని వలన కంపెనీ అమెరికాలో దాని డిమాండ్‌లో 80 శాతం తీర్చనుంది. అలాగే పెరుగుతున్న దేశీయ డిమాండ్‌లో 100 శాతం తీర్చగలదని భావిస్తున్నారు. అయితే జూన్ 2025 త్రైమాసికంలో (ఏప్రిల్ నుండి జూన్ 2025) అమెరికాలో విక్రయించే ఐఫోన్‌లలో ఎక్కువ భాగం భారతదేశంలోనే తయారు అవుతాయని ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ మే 2న ప్రకటించారు. అయితే, తన వ్యాఖ్యలు ప్రస్తుత త్రైమాసికానికే పరిమితం అని, భవిష్యత్ త్రైమాసికాలకు మార్గదర్శకత్వం అందించవని కుక్ నొక్కి చెప్పారు.

## బంగ్లా ఆంక్షలకు ప్రతి ఆంక్షలు...



ముంబై, మే, 20 (సూర్యసేన ప్రతినిధి): భారత-బంగ్లాదేశ్ మధ్య వైరం ముదురుతోంది. ఆ దేశం నుంచి దిగుమతయ్యే రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువుల దిగుమతులను భూమార్గం ద్వారా కాకుండా కోల్‌కతా లేదా ముంబై సమీపంలోని నవసేనా రేవుల ద్వారా మాత్రమే అనుమతిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు ఆ దేశ ప్రధాన ఎగుమతులైన దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను భూమార్గం ద్వారా కోల్‌కతా, లేదా ముంబైకి తరలించి విదేశాలకు ఎగువుమతి చేసేది. దీంతో ఈ రేవులు బంగ్లాదేశ్ సరుకులతో నిండిపోయి తమ సరుకులు నిల్వ చేసేందుకు కనీసం చోటు కూడా దొరకడం లేదని భారత ఎగమతిదారులు ఎప్పటి నుంచో ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. భారత నూలు, బియ్యం దిగుమతులతో పాటు అనేక వస్తువులపై బంగ్లాదేశ్ ఇటీవల ఇదే తరహా ఆంక్షలు విధించింది. ఎవరైనా భారత ఎగుమతిదారు భూమార్గం ద్వారా బంగ్లాదేశ్‌కు సరుకులు ఎగుమతి చేయాలంటే ప్రతి కిలోమీటరుకు టన్నుకు 1.8 టాకాల చొప్పున ప్రత్యేక ఫీజు విధించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం బంగ్లా దిగుమతులపై ఈ ఆంక్షలు విధించింది. ఈ నిషేధం ప్రభావం మన దేశానికి బంగ్లాదేశ్ చేసే 42 శాతం (77 కోట్ల డాలర్లు) ఎగుమతులపై ఉంటుందని అంచనా. నిషేధం ప్రభావం ఈశాన్య రాష్ట్రాలు, దేశంలో ఇతర ప్రాంతాల్లో రెడీమేడ్ దుస్తులు తయారు చేసే దేశీయ ఎంఎసఎంఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. నిజానికి బంగ్లాదేశ్ చౌకగా చైనా నుంచి వస్త్రాలు దిగుమతి చేసుకుని వాటిని దుస్తులుగా మార్చి మన దేశానికి జీరో డ్యూటీతో ఎగుమతి చేస్తోంది. దీనికి చెక్ పెట్టాలని దేశీయ పరిశ్రమ ముఖ్యంగా ఎంఎసఎంఈలు ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. 'మేము ఎప్పటి నుంచో దీని గురించి అడుగుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం దేశీయ పరిశ్రమకు ఎంతో మేలు చేస్తుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని దుస్తుల ఎగుమతి ప్రోత్సాహక మండలి (ఏఈపీసీ) జాతీయ వైస్ చైర్మన్ ఏ శక్తివేల్ అన్నారు. ఈ పరస్పర ఆంక్షలతో బంగ్లాదేశ్ అధికంగా నష్టపోతుందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ దేశ ప్రధాన ఎగుమతులైన దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను భూమార్గం ద్వారా కోల్‌కతా, లేదా ముంబైకి తరలించి విదేశాలకు ఎగువుమతి చేసేది. దీంతో ఈ రేవులు బంగ్లాదేశ్ సరుకులతో నిండిపోయి తమ సరుకులు నిల్వ చేసేందుకు కనీసం చోటు కూడా దొరకడం లేదని భారత ఎగమతిదారులు ఎప్పటి నుంచో ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టి మహ్మద్ యూనస్ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారం చేపట్టాక అక్కడ భారత వ్యతిరేకత ప్రబలిపోయింది. దీంతో కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్‌పై ఆర్థిక యుద్ధాన్ని తీవ్రం చేస్తోంది.

## త్వరలో కొత్త రూ.20 కరెన్సీ నోట్లు




ముంబై, మే, 20 (సూర్యసేన ప్రతినిధి): మహాత్మాగాంధీ (కొత్త) సిరీస్ కింద త్వరలో కొత్త రూ.20 డినామినేషన్ నోట్లను విడుదల చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ నోట్లపై ప్రస్తుత ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకం ఉంటుంది. రాబోయే రూ.20 నోట్ల డిజైన్, ఫీచర్లు మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్ కింద ప్రస్తుతం చెలామణిలో ఉన్న నోట్ల మాదిరిగానే ఉంటాయని సెంట్రల్ బ్యాంక్ స్పష్టం చేసింది. కలర్ స్కీమ్, కొలతలు, సెక్యూరిటీ ఫీచర్లు, వెనుకవైపు ఉండే ఎల్లోరా గుహల చిహ్నం.. అన్నీ అలాగే ఉంటాయి. "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్వరలో మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లో గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో రూ.20 డినామినేషన్ నోట్లను విడుదల చేస్తుంది. ఈ నోట్ల డిజైన్ అన్ని విధాలుగా మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లోని రూ .20 నోట్లను పోలి ఉంటుంది" అని సెంట్రల్ బ్యాంక్ ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. కాగా గతంలో జారీ చేసిన అన్ని రూ.20 నోట్లు జారీ చేసే గవర్నర్ సంతకంతో సంబంధం లేకుండా పూర్తిగా చెల్లుబాటు అవుతాయని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. కొత్త గవర్నర్ సంతకంతో కొత్త నోట్లను జారీ చేయడం అనేది ఆర్‌బిఐ అధినాయకత్వం మార్పు తరువాత సాధారణంగా జరిగే ప్రక్రియే. ఇది ప్రస్తుత కరెన్సీ నోట్ల వినియోగం లేదా విలువను ప్రభావితం చేయదు.

# ఎన్టీఆర్ బర్త్‌డే గిఫ్ట్.. 'వార్-2' టీజర్ విడుదల



బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ ఎన్టిఆర్ కలిసి నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'వార్-2'. 2019లో వచ్చిన 'వార్' సినిమాకు ఇది సీక్వెల్. హృతిక్, ఎన్టిఆర్ కలిసి నటిస్తుండటంతో 'వార్-2' సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఎన్టిఆర్ పుట్టినరోజు సందర్భంగా వార్-2 టీజర్‌ని చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'నా కళ్లు నిన్ను ఎప్పటినుంచో వెంటాడుతున్నాయి కబీర్' అంటూ ఎన్టిఆర్ చెప్పిన డైలాగ్‌తో ప్రారంభమైన ఈ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. టీజర్‌లో హృతిక్, ఎన్టిఆర్ యాక్షన్ సన్నివేశాలు అదిరిపోయాయి. చివర్లో ఎన్టిఆర్, హృతిక్‌ల నడుమ సాగే ఫైట్ టీజర్‌కి హైలైట్‌గా నిలిచింది. కాగా, ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14ను విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ టీజర్‌లో పేర్కొంది. యశ్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాను ఆదిత్య చోప్రా నిర్మించారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు.

# యంగ్ స్టార్ సినిమాలో..



హీరోయిన్ కీర్తి సురేష్ ప్రస్తుతం బిజీబిజీగా ఉంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ మంచి పాపులారిటీని సంపాదించుకుంది. తెలుగులో ఇప్పటికే మహేష్, నాని లాంటి స్టార్ హీరోలతో సినిమాలు చేసింది. ఈ నేపథ్యంలో ఈ బ్యూటీకి విజయ్ దేవరకొండతో నటించే అవకాశం వచ్చింది. రవి కిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ హీరోగా రౌడీ జనార్దన్ సినిమా చేయనున్నారు. ఈ చిత్రాన్ని దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఇందులో హీరోయిన్ గా కీర్తి సురేష్ ని తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో కీర్తి రోల్ రొమాంటిక్ గా ఉంటుందట. ఇక ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'కింగ్ డమ్' పనుల్లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా రిలీజ్ అనంతరం 'రౌడీ జనార్దన్' సినిమా ప్రారంభమవుతుంది.

# మనోజ్ బర్త్‌డే సర్ ప్రైజ్.. 'భైరవం' స్పెషల్ సాంగ్ రిలీజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్, నారా రోహిత్ హీరోలుగా తెరకెక్కిన సినిమా 'భైరవం'. మంగళవారం మంచు మనోజ్ బర్త్‌డే సందర్భంగా 'భైరవం' మూవీ నుంచి 'రాజా రాజా' అంటూ సాగే స్పెషల్ సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాలో గజపతి క్యారెక్టర్ లో మనోజ్ నటిస్తున్నాడు. థీమ్ ఆఫ్ గజపతి పేరుతో ఈ సాంగ్ ను విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ ఈ మూవీని భారీగా నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గాడా సమర్పిస్తున్నారు. ఈ సినిమా మే 30న వేసవి సీజన్‌లో బిగ్గెస్ట్ రిలీజ్ కి సిద్ధమవుతోంది.




# మళ్ళీ తెరమీదకు 'మాయాబజార్'

ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎస్.వి.రంగారావు, సావిత్రి, రేలంగి, గుమ్మడి, ముక్కామల, మిక్కిలినేని, అల్లు రామలింగయ్య, ఆర్. నాగేశ్వర రావు, సూర్యకాంతం, రమణా రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన గొప్ప పౌరాణిక చిత్రం మాయా బజార్. విజయా ప్రొడక్షన్స్ పతాకంపై నాగిరెడ్డి, చక్రపాణి 'మాయాబజార్' చిత్రాన్ని చిరస్మరణీయంగా రూపొందించారు. దర్శకుడు కె.వి.రెడ్డి 'మాయాబజార్' చిత్రాన్ని అపూర్వంగా, అనూహ్యంగా, అనితర సాధ్యంగా తెలుగు తెరపై ఓ సెల్యులాయిడ్ కావ్యంగా మలిచారు . 'మాయాబజార్' చిత్రాన్ని ఈనెల 28న మహానటుడు ఎన్. టి. రామారావు 102వ జయంతి సందర్భంగా బలుసు రామారావు విడుదల చేస్తున్నారు. 'మాయాబజార్' సినిమాకు పింగళి నాగేంద్ర రావు అద్భుతమైన మాటలను అందించారు. ఛాయాగ్రాహకుడు మార్కస్ బార్ట్ లే ఈ సినిమాను నవరస భరితంగా తెరమీద చూపించారు. ఘంటసాల సంగీత దర్శకత్వంలో ఈ చిత్రంలోని పాటలు ఈ తరం ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణుడుగా ఎన్. టి. రామారావు, ఘటోత్కచుడు గా ఎస్. వి. రంగారావు, శశి రేఖగా సావిత్రి, అభిమన్యుడిగా అక్కినేని నాగేశ్వర రావు ఆయా పాత్రలను సజీవంగా మన ముందు నిలబెట్టారు. ఈ చిత్రం 27 మార్చి 1957లో ఆంధ్ర దేశంలో విడుదలై



సంచలన విజయం సాధించింది. ఈ సినిమాను కలర్ లో మళ్ళీ తెలుగు ప్రేక్షకుల కోసం రామారావు బలుసు ఈనెల 28న విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మాయాబజార్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడి జనార్దన్, రమేష్ ప్రసాద్, ఎస్‌వి కృష్ణారెడ్డి, అచ్చి రెడ్డి, వీర శంకర్, భగీరథ, వైజె రాంబాబు, త్రిపురనేని చిట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టి.డి.జనార్ధన్ మాట్లాడుతూ " మాయాబజార్ సినిమా అప్పటి ఇప్పటి తరానికి ఒక మైలు రాయి లాంటిది. ఇప్పటితరంలో ఎన్నో గ్రాఫిక్స్ వచ్చినా ఆనాడే గ్రాఫిక్స్ లేని సమయంలో ఎంతో అద్భుతంగా మాయాబజార్ ను మలిచి తిరుగులేని విజయాన్ని అందుకున్నారు. మళ్ళీ ఇప్పుడు మాయాబజార్ ని బలుసు రామారావు విడుదల చెయ్యడం అభినందించదగ్గ విషయం"అని అన్నారు. రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ "ఎన్టీఆర్ కుటుంబానికి మా కుటుంబానికి చాలా దగ్గర సంబంధం ఉంది. మా తండ్రి, రామారావు కలిసి తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో సేవలు అందించారు. వాళ్ళ సేవలు చిరస్మరణీయం. మాయాబజార్ చిత్రాన్ని ఐమ్యాక్స్ థియేటర్ లో పెద్ద స్క్రీన్ లో విడుదల చెయ్యడానికి బలుసు రామారావు అనుమతి కోరారు. వెంటనే ఆమోదించాము"అని తెలిపారు.

## కేతిక శర్మ సుడి తిరిగింది...

# ఇదిదా సర్ప్రైజు



దేనికైనా టైం కలిసి రావాలని పెద్దలు ఊరికే అనలేదు. కేతిక శర్మను చూస్తుంటే అదే అనిపిస్తోంది. 2021 ఆకాష్ పూరి రొమాంటిక్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన తనకు డెబ్యూనే డిజాస్టరయ్యింది. తర్వాత నాగ శౌర్య లక్ష్య, వైష్ణవ్ తేజ్ రంగ రంగ వైభవంగా దారుణంగా పోయాయి. పవన్ కళ్యాణ్ బ్రోలో సాయి ధరమ్ తేజ్ కు జోడిగా నటిస్తే దాని వల్ల దక్కిన ఫలితమూ అంతంత మాత్రమే. అంటే నికరంగా నాలుగేళ్ల కాలంలో ఒక్క చెప్పుకోదగ్గ హిట్ పడలేదు. దీంతో రాబిన్ హుడ్ లో అదిదా సర్ప్రైజ్ స్పెషల్ సాంగ్ చేసింది. పుష్ప 2లో శ్రీలీల చేయగా లేనిది నేనేంటి అనుకుందో ఏంటో అదే పెద్ద ప్లస్ అయ్యింది. సినిమా పోయింది కానీ కేతిక శర్మ సాంగ్ మాత్రం హిట్టయ్యింది. కట్ చేస్తే శ్రీవిష్ణు సింగిల్ లో మెయిన్ హీరోయిన్స్ లో ఒకరిగా నటించడం కేతిక శర్మకు మరో సూపర్ సక్సెస్ అందించింది. లుక్స్ తో పాటు నటన కూడా ఆకట్టుకునేలా ఉండటంతో క్రమంగా ఆఫర్స్ పెరుగుతున్నాయట. రవితేజ %-% దర్శకుడు కిషోర్ తిరుమల కాంబోలో తెరకెక్కబోయే మూవీకి ఆమె మెయిన్ లీడ్ గా అనుకుంటున్నారని లేటెస్ట్ అప్డేట్. అనార్కలి టైటిల్ ప్రచారంలో ఉంది. తమిళంలో రాజేష్ సెల్వ సినిమా ఒకటి ఆల్రెడీ సెట్స్ మీద ఉంది. గీతా ఆర్ట్స్ సంస్థ మరో చిత్రం కోసం అడ్వాన్స్ ఇచ్చిందనే టాక్ ఉంది. మైత్రి బ్యానర్ లోనే మరో ప్రాజెక్టులో కేతిక లాకయ్యిందని తెలిసింది. ఇది కన్ఫర్మ్ అయ్యాకే రాబిన్ హుడ్ సాంగ్ చేసిందనే లింక్ ని కొట్టిపారేయలేం. సో సింగిల్ తో బోణీ జరిగిపోయింది కాబట్టి కేతిక శర్మ టైం మొదలైనట్టేననుకోవాలి. ఢిల్లీకి చెందిన ఈ ఒకప్పటి సోషల్ మీడియా మోడల్ ప్రస్తుతం హైదరాబాద్ కి షిఫ్ట్ అయ్యే ఆలోచనలో ఉంది. వరస ఆఫర్లు రావడంతో మెల్లగా కెరీర్ సెటిల్ చేసుకోవాలని చూస్తోంది. ఇంకో ఒకటో రెండో హిట్లు పడ్డాయంటే పెద్ద హీరోల సరసన కూడా పిలుపు రావొచ్చు. అయినా అయిదు సంవత్సరాలు ఓపిగ్గా ఎదురు చూసినందుకు రిజల్ట్ అయితే దక్కింది కానీ దాన్ని నిలబెట్టుకోవడమే తరువాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com